




PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 301, పేజీలు - 08

ఆదివారం, ఏప్రిల్ 19, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD






## ఇరాన్ మమ్మల్ని బ్లాక్‌మెయిల్ చేయలేదు

**- ట్రంప్ కీలక వ్యాఖ్యలు**



న్యూయార్క్ (ప్రశ్న న్యూస్) ఒకవైపు హర్మూజ్ జలసంధి, ఇరాన్ నౌకాశ్రయాలను అమెరికా దిగ్బంధించడం, మరోవైపు జలసంధిని మూసివేసినట్లు ఇరాన్ ప్రకటించడం మరోసారి ప్రపంచవ్యాప్తంగా చమురు ఆందోళనలకు కారణమైంది. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. హర్మూజ్ జలసంధిని మూసివేయడం ద్వారా ఇరాన్ తమపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేస్తోందని,

2లో..

## ఏఐ వినియోగంపై ఆందోళనలు వద్దు

**- సుప్రీంకోర్టు సీజేఐ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) కృత్రిమమేధ (ఏఐ) వినియోగంపై భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. న్యాయ వ్యవస్థలో ఏఐ వాడకంపై ఆయన సూచనలు చేశారు. ఏఐ విషయంలో ఆందోళనలు వద్దని అన్నారు. న్యాయవ్యవస్థలో సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వీకరించాలంటే అంతర్గత పరిమితులపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని అన్నారు. కర్ణాటక

2లో..

## బీర్ అమ్మకాల్లో బిగ్ ట్విస్ట్

**- ఇక కష్టమే**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) వేసవి తీవ్రత పెరుగుతోంది. మద్యం అమ్మకాల్లో బీర్లకు డిమాండ్ అదే స్థాయిలో ఉంది. కొద్ది రోజులుగా బీర్ సేల్స్ రికార్డు స్థాయిలో సాగుతున్నాయి. ఈ ఏడాది మార్చిలో బీర్ల విక్రయాలు 22 శాతం మేర పెరిగాయి.

2లో..

## స్వార్థ రాజకీయాల కోసం

# నారిశక్తిని అడ్డుకున్నారు

**- విపక్షాల పాపాలకు శిక్ష తప్పదని ప్రధాని మోదీ హెచ్చరిక**

- మహిళలకు జరిగిన అవమానాన్ని మర్చిపోం
- బిల్లుకు మద్దతివ్వకుండా విపక్షాలు చాలా పెద్ద తప్పు చేశాయన్న మోదీ
- విపక్షాలు భారీ మూల్యం చెల్లించుకోవడం ఖాయమని వ్యాఖ్య
- బిల్లుకు వ్యతిరేకంగా ఉండటమే కాకుండా సాకులు వెతుకుతున్నారన్న మోదీ

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) మహిళా రిజర్వేషన్ల బిల్లును ఓడించినందుకు కాంగ్రెస్ సహా విపక్ష పార్టీలన్నీ శిక్ష అనుభవించాల్సిందేనని ప్రధాని మోదీ అన్నారు. రాజ్యాంగసవరణ బిల్లు వీగిపోయిన సందర్భంగా ఆయన జాతినుద్దేశించి ప్రసంగించారు. ఈ రోజు నేను ఒక ముఖ్యమైన విషయం గురించి, ముఖ్యంగా ఈ దేశ మహిళల కోసం చర్చించడానికి ఇక్కడ ఉన్నాను. ఈ దేశంలోని ప్రతి పౌరుడు మహిళల పురోగతి ఎలా నిలిచిపోయిందో చూస్తున్నారు, మా శతవిధ ప్రయత్నాల పట్టికీ, మేము విజయం సాధించలేకపోయామని ఆయన తెలిపారు. నారీ శక్తి అధినియంలో సవరణలు చేయలేకపోయాము. దీనికి గాను దేశంలోని తల్లులందరికీ, సోదరీమణులందరికీ నేను క్షమాపణలు కోరుతున్నానని మోదీతెలిపారు. దేశ సంక్షేమమే మాకు మొదటి

2లో..



## మోదీ కుట్రలు

# ఓడిపోయాయి

- మహిళా రిజర్వేషన్ల బిల్లు వీగిపోవడంపై ప్రియాంక వ్యాఖ్యలు
- మోదీ సర్కార్‌కు తొలి ఓటమి, ప్రజాస్వామ్య విజయమని వెల్లడి
- ప్రతిపక్షాలన్నీ ఏకతాటిపైకి వచ్చాయన్న ప్రియాంక గాంధీ



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ల రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడంపై కాంగ్రెస్ అగ్రనేత, వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా తాజాగా స్పందించారు. ఈ బిల్లు వీగిపోవడాన్ని ప్రజాస్వామ్య విజయంగా ఆమె అభివర్ణించారు. దేశ సమాఖ్య నిర్మాణాన్ని మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నిందని ఆరోపించారు. మహిళలను అడ్డం పెట్టుకుని అధికారంలో కొనసాగాలని కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. అయితే ఇప్పటికే ప్రతిపక్షాల తీరుపై ప్రధాని మోదీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే.
పార్లమెంటులో శుక్రవారం జరిగిన సంఘటన ప్రజాస్వామ్యానికి దక్కిన గొప్ప విజయమని ప్రియాంక గాంధీ అభివర్ణించారు

2లో..



## మహిళా బిల్లు ఒక్కటే తెస్తే

# మద్దతిస్తాం

**- బీజేపీకి రేవంత్ రెడ్డి పిలుపు**

- 2023 నాటి మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెడితే ఇండియా కూటమి మద్దతిస్తుందని హామీ
- మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ వ్యతిరేకమన్నది అబద్ధమన్న రేవంత్ రెడ్డి
- డీలిమిటేషన్ పేరుతో బీజేపీ శాశ్వతంగా అధికారంలో ఉండాలని కుట్ర చేసిందని ఆగ్రహం

**న్యూఢిల్లీ / హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోవడానికి కాంగ్రెస్ , ఇండియా కూటమి కారణమని చేస్తున్న ప్రచారాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. మహిళా రిజర్వేషన్లను నియోజకవర్గాల పునర్విభజన తో ముడిపెట్టడం వల్లనే తాము అడ్డుకున్నామని స్పష్టం చేశారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. మీకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే, ఆ బిల్లును సవరించండి. కేవలం 33% మహిళా రిజర్వేషన్లకు సంబంధించి ప్రత్యేక బిల్లును సోమవారం నాటికి తీసుకురండి, మేము వెంటనే మద్దతు ఇచ్చి పాస్ చేస్తాం అని కేంద్రానికి సవాల్ విసిరారు. మహిళా బిల్లు పేరుతో దక్షిణాది రాష్ట్రాల సీట్లను తగ్గించాలనే కుట్రను సహించబోమని తేల్చిచెప్పారు. జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ జరిగితే దక్షిణాది రాష్ట్రాలు పార్లమెంటులో తమ ప్రాధాన్యతను కోల్పోతాయని రేవంత్ ఆందోళన వ్యక్తం చేశారు. గత 30-50 ఏళ్లుగా జనాభా నియంత్రణను

2లో..

## పునర్వికకు పునర్జన్మ

- కర్నూలు చిన్నారి పునర్వికకు అందిన ఇంజెక్షన్
- రూ.16 కోట్ల విలువైన ఇంజెక్షన్ అందించిన వైద్యులు
- నారా లోకేష్ సమక్షంలో హైదరాబాద్ ఆస్పత్రిలో ఇంజెక్షన్ పూర్తి



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఏడాదిన్నర వయసు ఉన్న ఓ చిన్నారి ప్రాణం నిలిపేందుకు తెలుగు ప్రజలు చేసిన ప్రయత్నం ఫలించింది. కర్నూలు చిన్నారి పునర్విక మృత్యువును జయించింది. పునర్వికకు పునర్జన్మ లభించింది. చిన్నారి మోముపై మళ్లీ చిరునవ్వులు విరబూశాయి. తెలుగు ప్రజల గొప్ప మనసు, మంత్రి నారా లోకేష్ సాయంతో చిన్నారి పునర్వికకు కావాల్సిన రూ.16 కోట్ల విలువైన ఇంజెక్షన్ ఆమెకు అందింది. అత్యంత అరుదైన

2లో..

## గొడ్డలి పార్టీ ఆగడాలు సాగనివ్వను

- మహిళా రిజర్వేషన్ బిల్లును కాంగ్రెస్ అడ్డుకుందన్న సీఎం - 33% రిజర్వేషన్లు అమలయ్యే వరకు పోరాడతామని స్పష్టీకరణ
- గొడ్డలి పార్టీకి కూల్చడం, నరకడమే తెలుసని విమర్శ - జూన్ నాటికి పట్టణాల్లో 100 శాతం చెత్త తొలగింపు లక్ష్యం




అమరావతి (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో గొడ్డలి పార్టీ ఆగడాలను ఎంతమాత్రం సహించేది లేదని, ఇక్కడ ఉన్నది 1995 నాటి ముఖ్యమంత్రి అని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో హెచ్చరించారు. గొడ్డలి పార్టీకి తెలిసిందల్లా విధ్వంసం, కూల్చడం, నరకడమేనని, వారి ఆటలు సాగనివ్వబోమని స్పష్టం చేశారు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులో నిర్వహించిన 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. గత ప్రభుత్వం పేదల కోసం ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లను కక్షపూరితంగా మూసివేసిందని, పేదలకు కడుపునిండా అన్నం పెట్టలేని ప్రభుత్వాలు ఉన్నా ఒకటే లేకపోయినా ఒకటేనని విమర్శించారు. రాష్ట్రంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్, కేంద్రంలో నరేంద్ర మోదీ ఉన్నారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని, ఎవర్నీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని గట్టిగా హెచ్చరించారు.

### గొడ్డలి పార్టీ ఆగడాలు సాగనివ్వను

సుపరిపాలన అందించడమే తమ కూటమి లక్ష్యమని చంద్రబాబు అన్నారు. గత ప్రభుత్వం పోలవరం డయాఫ్రం వాల్‌ను గోదావరిలో కలిపేసిందని, కేంద్ర ప్రభుత్వ సహకారంతో గోదావరి పుష్కరాల కంటే ముందే పోలవరాన్ని పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రానికి రూ. 20 లక్షల కోట్ల పెట్టుబడులు రాబోతున్నాయని, తద్వారా 23 లక్షల ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. అమరావతికి రాజధానిగా చట్టబద్ధత లభించిందని, గతంలో 33 వేల ఎకరాలు ఇచ్చిన రైతులతో పాటు

2లో..

## సింహం బయటకు వస్తుంటే గుంటనక్కల గుండెల్లో దడ

**- కేసీఆర్ సభ అనేసరికి ప్రభుత్వం కుట్రలకు తెరలేపుతోందని విమర్శ**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) సింహం బయటకు వస్తుందంటే గుంటనక్కల గుండెల్లో దడ పుడుతుందని, అందుకే కేసీఆర్ జగిత్యాలలో బహిరంగ సభకు వస్తున్నారంటే రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్నో కుట్రలకు తెరలేపుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. జగిత్యాలలో మాజీ మంత్రి జీవన్ రెడ్డిని కేటీఆర్, హరీశ్ రావులు కలిశారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ, కేసీఆర్ సభ పెడతానంటే అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. రేవంత్ రెడ్డి చాలా

2లో..

## వరంగల్ విమానాశ్రయానికి

# త్వరలో శంకుస్థాపన

**- ఎయిర్‌పోర్టుకు 953 ఎకరాల భూమి సేకరణ**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) వరంగల్ విమానాశ్రయానికి త్వరలో శంకుస్థాపన చేస్తామని తెలంగాణ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.
సచివాలయంలో ఎయిర్ పోర్ట్ అథారిటీ సదరన్ రీజియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజ్‌కిషోర్, ఏవియేషన్ డైరెక్టర్ భరత్ రెడ్డి, ఇతర అధికారులతో విమానాశ్రయాల ఏర్పాటుపై మంత్రి సమీక్ష నిర్వహించారు. వరంగల్, ఆదిలాబాద్, కొత్తగూడెంలో విమానాశ్రయాల నిర్మాణంపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ, సాంకేతిక అనుమతులు, మౌలిక వసతుల ఏర్పాటుకు చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. కేంద్ర

2లో..



## గ్రీన్ స్టీల్ ప్లాంట్‌కు వినతి

**- కేంద్రమంత్రి కుమారస్వామిని కలిసిన రేవంత్ రెడ్డి**

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బిజీ బిజీగా గడుపుతున్నారు. ఈ సందర్భంగా కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి, కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మలతో రేవంత్ రెడ్డి శనివారం ఉదయం భేటీ అయి చర్చించారు. తెలంగాణలోని బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్ నెలకొల్పాలంటూ కేంద్రమంత్రులకు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఇందుకు సంబంధించిన వినతి పత్రాన్ని కేంద్రమంత్రికి అందించారు. బయ్యారంలో ఉక్కు ప్లాంట్

3లో..

## జగన్ చేసిన నీచపు పనికి

# వైఎస్ఆర్ ఆత్మ ఘోషిస్తోంది

**- వైఎస్ జగన్‌పై షర్మిల ఘాటు విమర్శలు**



అమరావతి (ప్రశ్న న్యూస్) వైసీపీ అధ్యక్షుడు జగన్ పై ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బీజేపీతో జగన్ అక్రమ పొత్తు బట్టబయలైందని, విపక్షం ముసుగులో ఉన్నది ఆర్ఎస్ఎస్ పక్షమేనని తేలిపోయిందని ఆమె ధ్వజమెత్తారు. "దత్తపుత్రుడు జగన్ తెర తొలగింది" అంటూ ఘాటు వ్యాఖ్యలు

2లో..

## కాంగ్రెస్ ప్రభుత్వం భూమి ఇవ్వకుంటే మనమే ఆక్రమించుకుందాం

**- ఉద్యమకారులకు ఇస్తామన్న హామీలు నెరవేర్చాలని కవిత డిమాండ్**




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తామన్న భూమి ఇవ్వకపోతే మనమే ఆక్రమించుకుందామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ జాగృతి ఇప్పటికే ఉద్యమకారుల తరఫున ఎన్నో పోరాటాలు చేసిందని,

2లో..

# స్వార్థ రాజకీయాల కోసం నారిశక్తిని అడ్డుకున్నారు

ప్రాధాన్యత. కానీ, కొంతమందికి దేశ సంక్షేమం కంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమైనప్పుడు, దాని భారాన్ని ఈ దేశ మహిళలే మోయాల్సి వస్తుంది. ఈసారి కూడా అదే జరిగిందని అన్నారు. కాంగ్రెస్, డీఎంకే, టీఎంసీ , సమాజ్ వాదీ పార్టీ వంటి పార్టీల స్వార్థ రాజకీయాల భారాన్ని ఈ దేశ నారీ శక్తి భరించాల్సి వచ్చిందన్నారు. వ్యక్తిగతంగా, కాంగ్రెస్ తన దశాబ్దాల కాలం నాటి తప్పును సరిదిద్దుకుంటుందని, తన పాపాలకు ప్రాయశ్చిత్తం చేసుకుంటుందని నేను ఆశించానని మోదీ అన్నారు. కానీ చరిత్రను లిఖించే అవకాశాన్ని, మహిళలకు అండగా నిలిచే అవకాశాన్ని కాంగ్రెస్ చేజార్చుకుంది. దేశంలోని మెజారిటీ ప్రాంతాల్లో కాంగ్రెస్ తన ఉనికిని కోల్పోయింది. ఒక పరాన్నజీవిలా కాంగ్రెస్ ప్రాంతీయ పార్టీలపై ఆధారపడుతూ తనను తాను బ్రతికించుకుంటోంది. అయితే కాంగ్రెస్ ఆ ప్రాంతీయ పార్టీలు బలపడటం కూడా ఇష్టపడదు. అందుకే, ఈ సవరణను ఆ ప్రాంతీయ పార్టీల చేత వ్యతిరేకింపజేసి, వారి భవిష్యత్తును చీకట్లోకి నెట్టేలా ఒక రాజకీయ కుట్ర పన్నిందని విమర్శించారు. పార్లమెంటులో నారీ శక్తి వందన్ సవరణను వ్యతిరేకించిన పార్టీలకు నేను స్పష్టంగా చెబుతున్నాను మహిళా శక్తిని తక్కువ అంచనా వేస్తున్నారని హెచ్చరించారు. ఇరవై ఒకటవ శతాబ్దపు మహిళలు దేశంలో జరుగుతున్న ప్రతి సంఘటనను నిశితంగా గమనిస్తున్నారనే విషయాన్ని వారు మర్చిపోతున్నారు. మహిళలు వీరి ఉద్దేశాలను అర్థం చేసుకుంటున్నారు, నిజమేంటో వారికి పూర్తి అవగాహన ఉంది. అందుకే, మహిళా రిజర్వేషన్లను వ్యతిరేకించడం ద్వారా ప్రతిపక్షాలు చేసిన ఈ పాపానికి ఖచ్చితంగా శిక్ష అనుభవిస్తారని హెచ్చరించారు. కాంగ్రెస్, ఎస్పీ, డీఎంకే, టీఎంసీ సహా ఇతర పార్టీలు ఇన్నేళ్లుగా ఒకే విధమైన సాకులు చెబుతూ వస్తున్నాయి. ఏవో కొన్ని సాంకేతిక అంశాలను సాకుగా చూపి, మహిళల హక్కులను కాలరాశాయి. ఈ వికృత రాజకీయ పోకడలను, వీటి వెనుక ఉన్న అసలు కారణాలను దేశం ఇప్పటికే అర్థం చేసుకుందని ప్రధాని మోదీ అన్నారు. నారీ శక్తి వందన్ అధినియాన్ని వ్యతిరేకించడం వెనుక ఒక బలమైన కారణం ఉంది – అదే ఈ వారసత్వ పార్టీల భయం. మహిళలు గనుక సాధికారత సాధిస్తే, తమ వారసత్వ రాజకీయాల నాయకత్వానికి ముప్పు వాటిల్లుతుందని ఈ పార్టీలు వణికిపోతున్నాయి. తమ కుటుంబాలకు చెందని మహిళలు రాజకీయాల్లో ఎదిగి, ముందుకు రావడాన్ని ఇవి ఎన్నటికీ సహించలేవన్నారు. ఈ పార్టీలు రాజ్యాంగ నిర్మాతల ఆశయాలను కూడా అవమానించాయి, ఈ పాపానికి గాను ప్రజలు ఇచ్చే శిక్ష నుండి వీరు తప్పించుకోలేరని మోదీ అన్నారు. నారీ శక్తి వందన్ సవరణ అనేది ఎవరి దగ్గరో ఏదో లాక్కోవడం కోసం తెచ్చింది కాదు, అందరికీ ఏదో ఒకటి ఇవ్వడం కోసం ఉద్దేశించింది. గత 40 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న హక్కులను మహిళలకు కల్పిస్తూ, 2029 ఎన్నికల నాటికి వారిని సాధికారత వైపు నడిపించడమే దీని లక్ష్యం. వారి ప్రగతి పథంలో ఉన్న అడ్డంకులను తొలగించేందుకు చేపట్టిన ఒక 'మహాయజ్ఞం' ఇది. ప్రస్తుత తరుణంలో నారీ శక్తి వందన్ సవరణ దేశానికి ఎంతో అవసరమని గుర్తుచేశారు. కాంగ్రెస్ , దాని మిత్రపక్షాలు పార్లమెంటులో అందరి కళ్ల ముందే ఈ బృహత్తర ప్రయత్నాన్ని భ్రూణహత్య చేశాయి. కాంగ్రెస్, టీఎంసీ, సమాజ్ వాదీ పార్టీ, డీఎంకే వంటి పార్టీలే దీనికి బాధ్యులు. ఈ దేశ నారీ శక్తి పట్ల అపరాధులుగా వీరు మిగిలిపోతారని మోదీ స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్ల అంశంపై కాంగ్రెస్ ద్వేషపూరితంగా వ్యవహరిస్తోంది, దీనిని అడ్డుకునేందుకు ఎల్లప్పుడూ కుట్రలు చేస్తూనే ఉంది. గతంలో ఎప్పుడు ఈ దిశగా ప్రయత్నాలు జరిగినా, కాంగ్రెస్ ఏదో ఒక రూపంలో అడ్డంకులు సృష్టించింది. ఈసారి కూడా కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు అబద్ధపు ప్రచారాలతో ఈ ప్రక్రియను ఆపేందుకు యత్నించాయి. తద్వారా వారు యావత్ దేశాన్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని మోదీ విమర్శించారు. నియోజకవర్గాల పునర్విభజన అంశంపై కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు నిరంతరం అబద్ధాలను ప్రచారం చేస్తున్నాయని మోదీవిమర్శించారు. ఈ సాకుతో దేశంలో విభజన సెగలు రాజేయాలని అవి ప్రయత్నిస్తున్నాయి. బ్రిటిష్ వారి నుంచి వారసత్వంగా పొందిన విభజించి పాలించు రాజకీయాన్నే కాంగ్రెస్ నేటికీ అనుసరిస్తోందని మోదీ మండిపడ్డారు. దేశంలో చీలికలు తెచ్చే భావోద్వేగాలను రెచ్చగొట్టడమే కాంగ్రెస్ నైజం. పునర్విభజన వల్ల కొన్ని రాష్ట్రాలు నష్టపోతాయనే తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేశారు. అయితే, ఏ రాష్ట్ర ప్రాతినిధ్యం తగ్గదని, రాష్ట్రాల సీట్ల నిష్పత్తిలో మార్పు ఉండదని ప్రభుత్వం మొదటి రోజు నుంచే స్పష్టం చేస్తూ వస్తోంది. అన్ని రాష్ట్రాల సీట్లను సమాన నిష్పత్తిలో పెంచడం జరుగుతుంది. అయినప్పటికీ, కాంగ్రెస్, డీఎంకే, టీఎంసీ, ఎస్పీ వంటి పార్టీలు ఈ వాస్తవాన్ని అంగీకరించడానికి సిద్ధంగా లేవని విమర్శించారు. ఈ సవరణ బిల్లు అన్ని రాజకీయ పార్టీలకు , రాష్ట్రాలకు ఒక గొప్ప అవకాశమని మోదీ గుర్తు చేశారు. ఒకవేళ ఈ బిల్లు ఆమోదం పొంది ఉంటే తమిళనాడు, బెంగాల్, ఉత్తరప్రదేశ్, కేరళతో పాటు ప్రతి రాష్ట్రంలోనూ సీట్ల సంఖ్య పెరిగేది. కానీ తమ స్వార్థ రాజకీయాల కోసం ఈ పార్టీలు సొంత రాష్ట్ర ప్రజలకే ద్రోహం చేశాయి. తమిళనాడు నుంచి మరింత మంది తమిళులను ఎంపీలు, ఎమ్మెల్యేలుగా పంపే అవకాశం డీఎంకేకు ఉండేది, తద్వారా తమిళనాడు గొంతుక మరింత బలోపేతం అయ్యేది. కానీ ఆ అవకాశాన్ని వారు చేజార్చుకున్నారు.

అదేవిధంగా బెంగాల్ ప్రజలను ముందుకు నడిపించే అవకాశం టీఎంసీకి లభించినా, ఆ పార్టీ దానిని వినియోగించుకోలేకపోయింది. అటు సమాజ్ వాదీ పార్టీ తనకున్న మహిళా వ్యతిరేక ముద్రను చెరిపేసుకునే అవకాశం వచ్చినప్పటికీ, దానిని వదులుకుంది. ఎస్పీ ఇప్పటికే లోహియా ఆశయాలను మరిచిపోయింది. నారీ శక్తి వందన్ సవరణను వ్యతిరేకించడం ద్వారా లోహియా గారి కలలను ఎస్పీ చిదిమేసింది. ఎస్పీ మహిళా రిజర్వేషన్లకు వ్యతిరేకమని, ఉత్తరప్రదేశ్ . దేశవ్యాప్తంగా ఉన్న మహిళలు ఈ విషయాన్ని ఎన్నటికీ మర్చిపోరని మోదీ స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్లను వ్యతిరేకించడం ద్వారా కాంగ్రెస్ పార్టీ తాము సంస్కరణలకు వ్యతిరేకమని మరోసారి నిరూపించుకుంది. 21వ శతాబ్దపు 'వికసిత భారత్' నిర్మాణానికి అవసరమైన ప్రతి నిర్ణయాన్ని, ప్రతి సంస్కరణను కాంగ్రెస్ అడ్డుకుంటోంది. దేశం తీసుకుంటున్న ప్రగతిశీల నిర్ణయాలను ఆ పార్టీ తిరస్కరించడమే కాకుండా, వాటికి అడ్డంకులు సృష్టిస్తోంది. కాంగ్రెస్ చరిత్ర అంతా ఇటువంటి ప్రతికూల రాజకీయాలతోనే నిండి ఉందని గుర్తు చేశారు.

## వరంగల్ విమానాశ్రయానికి త్వరలో శంకుస్థాపన


ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ పనులను త్వరితగతిన ముందుకు తీసుకువెళ్లాలని అధికారులకు సూచించారు. వరంగల్ విమానాశ్రయానికి సంబంధించి ఇప్పటికే సుమారు 953 ఎకరాల భూమిని సేకరించి కేంద్రానికి అప్పగించిన విషయాన్ని గుర్తు చేశారు. త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. డిఫెన్స్, సివిల్ ఏవియేషన్, తెలంగాణ ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో ఆదిలాబాద్ విమానాశ్రయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గతంలో ప్రతిపాదించిన స్థలం విమానాశ్రయ నిర్మాణానికి అనుకూలంగా లేదని కేంద్ర పౌర విమానయాన శాఖ తెలిపిన నేపథ్యంలో, దీనిపై మరింత లోతైన అధ్యయనం చేసి సాధ్యాసాధ్యాలపై నివేదిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

## జగన్ చేసిన నీచపు పనికి వైఎస్ఆర్ ఆత్మ ఘోషిస్తోంది

చేశారు. రాజ్యాంగ పరిరక్షణ కంటే బీజేపీ భజనే జగన్‌కు ముఖ్యమా అని ఆమె ప్రశ్నించారు. పార్లమెంటులో ప్రవేశపెట్టిన అక్రమ డీలిమిటేషన్ బిల్లుకు మద్దతు పలికినందుకు జగన్ సిగ్గుపడాలని అన్నారు. తన ఐదేళ్ల పాలనలో చేసిన అవినీతి, కేసుల నుంచి రక్షణ పొందేందుకే జగన్ బీజేపీకి బానిసగా మారారని షర్మిల తీవ్ర ఆరోపణలు చేశారు. "కేసుల నుంచి రక్షణ కోసం బానిసగా బ్రతకాలా? బీజేపీ బిల్లులకు గొర్రెలా గుడ్డిగా తలాడించాలా? మోదీ మెప్పుకోసం సొంత కాకిలెక్కలు అల్లాలా?" అని నిలదీశారు. మహానేత వైఎస్ఆర్ సిద్ధాంతాలను, విలువలను జగన్ మంటగలిపారని, దీనిపై ఆయన ఆత్మవిమర్శ చేసుకోవాలని హితవు పలికారు. రాజ్యాంగానికి విఘాతం కలిగించే బిల్లును విపక్షాలు అడ్డుకుంటే, ఆ బిల్లును అడ్డుకోవడం ద్వారా ఏం సాధించారని జగన్ ప్రశ్నించడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. ఈ దొంగ బిల్లుకు ఓటేసి జగన్ ఏం సాధించారని, కోట్లాది ఆంధ్రప్రదేశ్ ప్రజల మనోభావాలను గాయపరిచారని మండిపడ్డారు. మహిళా రిజర్వేషన్ బిల్లును డీలిమిటేషన్‌కు ముడిపెట్టడం జగన్ అవివేకానికి నిదర్శనమని షర్మిల అన్నారు. మహిళల 33 శాతం రిజర్వేషన్లకు కాంగ్రెస్ పార్టీ సహా ఎవరూ వ్యతిరేకం కాదని, కానీ బీజేపీ ప్రభుత్వం దాని అమలును ఆలస్యం చేసేందుకే డీలిమిటేషన్, జనాభా లెక్కలు అనే నిబంధనలు పెట్టిందని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజనపై తమ పార్టీ వైఖరి స్పష్టంగా ఉందని తెలిపారు. 2026 జనాభా లెక్కలు, కులగణన పూర్తయ్యాక, ఆ గణాంకాల ఆధారంగా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు న్యాయం చేస్తూ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే ప్రస్తుతమున్న 543 లోక్‌సభ స్థానాలకే మహిళా రిజర్వేషన్లను వర్తింపజేయాలని కాంగ్రెస్ పార్టీ కోరుతోందని వివరించారు. అధికారిక గణాంకాలు లేకుండానే సీట్లు పెంచి దేశాన్ని ఉద్ధరిస్తున్నామని బీజేపీ చెబితే, జగన్ గుడ్డిగా నమ్మడం రాష్ట్ర ప్రజలను మోసం చేయడమేనని షర్మిల అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ అంటే బాబు, జగన్, పవన్ అని, ఈ మూడు పార్టీలూ మోదీ మెప్పుకోసమే పనిచేస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో నిజమైన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని, ప్రజల హక్కుల కోసం పోరాడుతున్నది తామేనని ఆమె పేర్కొన్నారు.

### కాంగ్రెస్ ప్రభుత్వం భూమి ఇవ్వకుంటే

## మనమే ఆక్రమించుకుందాం




మున్ముందు ఉద్యమకారులతో కలిసి పనిచేస్తుందని అన్నారు. ఉద్యమకారులకు, అమరవీరుల కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో 'చలో సెక్రటరియేట్' పేరుతో సచివాలయ ముట్టడికి బయలుదేరగా తెలంగాణ జాగృతి కార్యకర్తలు, ఉద్యమకారులను పోలీసులు అరెస్టు చేసి సమీప పోలీస్ స్టేషన్‌లకు తీసుకువెళ్లారు. మెహిదీపట్నం పోలీస్ స్టేషన్‌లో అరెస్టైన వారిని కవిత పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం వచ్చాక కూడా ఉద్యమకారులను జైల్లో పెట్టడం దురదృష్టకరమని అన్నారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం తప్పించుకుంటోందని ఆరోపించారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే కాంగ్రెస్ నాయకులు బయట తిరిగే పరిస్థితి ఉండదని హెచ్చరించారు. ఉద్యమకారులకు భూమి, పెన్షన్ హామీని అమలు చేయకుంటే జాగృతి ఆధ్వర్యంలో భూపోరాటాలు చేసి భూమి ఆక్రమించుకుంటామని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ముందున్నదే ఉద్యమకారులని కవిత తెలిపారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు రాష్ట్రాన్ని పాలించినప్పటికీ, ఉద్యమకారులకు దక్కాల్సిన గౌరవం దక్కలేదని విమర్శించారు. అమరవీరుల కుటుంబాలకు, ఉద్యమకారులకు పెన్షన్, భూమి ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వాటిని నెరవేర్చడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండున్నరేళ్లు గడుస్తున్నా హామీ నెరవేర్చకపోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలపై తెలంగాణ జాగృతి ఒత్తిడి చేస్తే, ఉద్యమకారుల బిల్లు పెడతామని హామీ ఇచ్చారని, కానీ అసెంబ్లీలో ఆ ఊసే ఎత్తకుండా మోసం చేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల కోసం ఉద్యమకారులు సచివాలయాన్ని ముట్టడించే పరిస్థితి రావడం దురదృష్టకరమని అన్నారు. ఉద్యమకారులు ధైర్యంగా ఉండాలని, మనం కొట్లాడి తెచ్చుకున్నతెలంగాణలో హక్కులు సాధించుకోవడం కష్టమేమీ కాదని అన్నారు.

## పునర్వికకు పునర్జన్మ

స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ వ్యాధితో (ఎస్ఎంఏ టైపు-1) బాధపడుతున్న పునర్వికను కాపాడేందుకు మంత్రి నారా లోకేష్ విదేశాల నుంచి ఈ ఇంజెక్షన్ తెప్పించారు. శనివారం ఉదయం హైదరాబాద్‌లో ఉన్న రెయిన్‌బో ఆసుపత్రిలో మంత్రి నారా లోకేష్ సమక్షంలో రెయిన్‌బో ఆస్పత్రి డాక్టర్లు విదేశాల నుంచి తెప్పించిన రూ. 16 కోట్ల ఖరీదైన జోల్ జెన్ స్మా ఇంజెక్షన్ పునర్వికకు అందించారు. కర్నూలు జిల్లాలోని వెల్దుర్తికి చెందిన సురేష్ కుమార్, పుష్పావతిల కుమార్తె పునర్విక. పుట్టిన ఆరు నెలలకే పునర్విక శరీరంలో కదలికలు తగ్గిపోయాయి. తల్లిదండ్రులు డాక్టర్లను సంప్రదిస్తే పునర్వికను పరీక్షించిన వైద్యులు ఆమె అరుదైన స్పైనల్ మస్క్యులర్ అట్రోపీ వ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తించారు. ఈ వ్యాధి కారణంగా పునర్విక వెన్నెముక కండరాలు క్షీణించి, శ్వాస తీసుకోవడం కష్టమయ్యే పరిస్థితి. దీని నుంచి బయటపడాలంటే పునర్వికకు రూ. 16 కోట్ల ఇంజెక్షన్ ఇవ్వాల్సి ఉంటుందని సూచించారు. అయితే సెలూన్ షాపులో పనిచేసే సురేష్ కుమార్‌కు అంత మొత్తాన్ని ఎలా సేకరించాలో అర్థం కాలేదు. ఓ వైపు చిన్నారి ప్రాణం మరోవైపు అంతంత మాత్రంగా ఆర్థిక పరిస్థితి. ఈ సమయంలో తెలుగు రాష్ట్రాల ప్రజల చిన్నారి పునర్వికకు అండగా నిలిచారు. సేవ్ పునర్విక హ్యాష్ ట్యాగ్ సోషల్ మీడియాలో ట్రెండింగ్ అయ్యింది. పునర్విక కథ ప్రతి ఒక్కరినీ కదిలించింది. పసిపాప ప్రాణాన్ని నిలబెట్టేందుకు తెలుగు ప్రజలు తమ ఉదారతను చూపించారు. లక్షలాది మంది దాతలు స్పందించారు. తమకు తోచిన సాయం అందించటంతో రూ. 10 కోట్లు సమకూరాయి. ఇంకో రూ. 6 కోట్లు అవసరం కాగా చిన్నారి పరిస్థితిని తెలుసుకున్న నారా లోకేష్ ఆ కుటుంబానికి అండగా నిలిచారు. రూ.6 కోట్లు తాను సమకూరుస్తానని మాట ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం విదేశాల నుంచి ఇంజెక్షన్ తెప్పించేందుకు తన వ్యక్తిగత సిబ్బందిని రంగంలోకి దించారు నారా లోకేష్. అన్ని అనుమతులు వేగంగా మంజూరయ్యేలా చూశారు. దీంతో చిన్నారి పునర్వికకు పునర్జన్మ లభించింది. శనివారం ఆమెకు కావాల్సిన ఇంజెక్షన్ వైద్యులు అందించారు. ఈ సందర్భంగా వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు నారా లోకేష్. పునర్వికను ఎత్తుకుని లాలించారు. వందేళ్లు చల్లగా ఉండు తల్లీ అంటూ దీవించారు. తమ కుమార్తె ప్రాణాలను కాపాడిన నారా లోకేష్‌కు, తెలుగు ప్రజలకు పునర్విక తల్లిదండ్రులు కృతజ్ఞతతో ధన్యవాదాలు తెలియజేశారు.

## గొడ్డలి పార్టీ ఆగడాలు సాగనివ్వను

ఇప్పుడు మరో 10 గ్రామాల రైతులు కూడా భూములు ఇచ్చేందుకు ముందుకొచ్చారని వెల్లడించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 269 అన్న క్యాంటీన్లు తిరిగి పనిచేస్తున్నాయని, పేదల ఆకలి తీర్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు.

### మహిళా బిల్లును అడ్డుకున్నది కాంగ్రెసే

మహిళా రిజర్వేషన్ బిల్లు విషయంలో కాంగ్రెస్ పార్టీ దశాబ్దాలుగా మహిళలను మోసం చేస్తోందని చంద్రబాబు తీవ్రంగా విమర్శించారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును ప్రతిసారీ అడ్డుకోవడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందన్నారు. 1996లో దేవెగౌడ ప్రధానిగా ఉన్నప్పుడు, తాను యునైటెడ్ ఫ్రంట్ కన్వీనర్‌గా ఉండగా బిల్లు పెడితే కాంగ్రెస్ సహకరించలేదని గుర్తుచేశారు.

ఆ తర్వాత వాజ్‌పేయి హయాంలో నాలుగుసార్లు బిల్లు తెచ్చినా కాంగ్రెస్ అడ్డుపడిందని ఆరోపించారు. 2010లో యూపీఏ అధికారంలో ఉన్నప్పుడు రాజ్యసభలో ఆమోదం పొందిన బిల్లును లోక్‌సభ ముందుకు తీసుకురాకుండా మహిళలకు ద్రోహం చేసిందన్నారు. ఇప్పుడు ప్రధాని మోదీ పట్టుదలతో బిల్లు తెస్తే, డీలిమిటేషన్ పేరుతో మళ్లీ అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని, వారి లాజిక్ ఏంటో అర్థం కావడం లేదన్నారు. మహిళలకు 33% రిజర్వేషన్లు అమలయ్యే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

### మహిళా సాధికారతకు పెద్దపీట

మహిళల సామర్థ్యాన్ని గుర్తించి గౌరవించిన ఘనత తమ ప్రభుత్వాలదేనని చంద్రబాబు అన్నారు. ఎన్టీఆర్ హయాంలో స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు, ఆస్తిలో సమాన హక్కు కల్పించారని గుర్తుచేశారు. తాను డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేసి మహిళల ఆర్థిక ప్రగతికి బాటలు వేశానని, నేడు డ్వాక్రా మహిళలు రూ. 50 వేల కోట్ల రుణాలు తీసుకునే స్థాయికి ఎదిగారని తెలిపారు. తమ ప్రభుత్వం 'సూపర్ సిక్స్' హామీలను సూపర్ హిట్ చేసిందని, ప్రతి నెలా 63 లక్షల మందికి పింఛన్లు అందిస్తున్నామని, తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల వంటి పథకాలతో మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని వివరించారు.

### జూన్ నాటికి 100% చెత్త క్లియరింగ్

స్వచ్ఛాంధ్రప్రదేశ్ నిర్మాణమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని చంద్రబాబు తెలిపారు. గత పాలకులు రాష్ట్రాన్ని చెత్తకుప్పగా మార్చారని, తాము అధికారంలోకి వచ్చాక పట్టణాల్లో పేరుకుపోయిన 153 లక్షల టన్నుల చెత్తలో ఇప్పటికే 114 లక్షల టన్నులు తొలగించామని, ఈ జూన్ నాటికి 100 శాతం క్లియర్ చేస్తామని ప్రకటించారు. చెత్త సేకరణ, ప్రాసెసింగ్‌ను 100 శాతానికి పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని, రూ. 603 కోట్లతో 107 ఆధునిక ప్రాసెసింగ్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో ప్రస్తుతం 31.33 శాతంగా ఉన్న పచ్చదనాన్ని 2047 నాటికి 50 శాతానికి పెంచడమే లక్ష్యమన్నారు.

### నిడదవోలు అభివృద్ధికి ప్రత్యేక హామీలు

ఈ సందర్భంగా నిడదవోలు నియోజకవర్గ ప్రగతి నివేదికను ప్రజల ముందుంచిన చంద్రబాబు, నియోజకవర్గ అభివృద్ధికి పలు హామీలు ఇచ్చారు. స్థానికంగా చిన్న కాశిరేవు వంతెన పునర్నిర్మాణం, ఇండోర్ స్టేడియం, ప్రభుత్వాసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా మార్చడం, ఆర్టీసీ బస్టాండ్ అభివృద్ధి, కంసాలిపాలెం నుంచి మాధవరం వరకు వంతెన నిర్మాణం, ఎర్రకాలువ గండ్ల పూడ్చివేత, టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసే బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నక్కా ఆనందబాబు, కందుల దుర్గేష్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి, పలువురు అధికారులు, నేతలు పాల్గొన్నారు.

## ఇరాన్ మమ్మల్ని బ్లాక్‌మెయిల్ చేయలేదు

కానీ ఇలాంటి వాటిని ఉపేక్షించేది లేదని అన్నారు. ఇరాన్ తమను బ్లాక్‌మెయిల్ చేయలేదని హెచ్చరించారు. "టెహ్రాన్ దశాబ్దాలుగా ఇలాగే వ్యవహరిస్తోంది. కానీ వారు మమ్మల్ని బ్లాక్ మెయిల్ చేయలేరు" అని వైట్ హౌస్ లో విలేకరుల సమావేశంలో ట్రంప్ అన్నారు. ఇరుపక్షాల మధ్య చర్చలు కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. ఇరాన్‌తో సంప్రదింపులు కొనసాగుతున్నాయని తెలిపారు. రోజు ముగిసే సమయానికి సంప్రదింపులకు సంబంధించి కొంత సమాచారం లభిస్తుందని వెల్లడించారు. హార్ముజ్ జలసంధిని తెరుస్తున్నట్లు ఇరాన్ తొలుత ప్రకటించింది. ఇరవై నాలుగు గంటలు తిరగక ముందే తిరిగి మూసివేస్తున్నట్లు ప్రకటించింది. తమ ఓడరేవుల చుట్టూ అమెరికా తన దిగ్బంధనాన్ని కొనసాగిస్తున్నందువల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఇరాన్ తెలిపింది.

## ఏఐ వినియోగంపై ఆందోళనలు వద్దు

రాష్ట్ర స్టేట్ జ్యూడిషియల్ ఆఫీసర్స్ అసోసియేషన్ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, సాంకేతికత అనేది సలహాలు ఇవ్వడంలో ఉపయోగపడుతుందని అన్నారు. ఏఐ మనుషులకు ఏమాత్రం ప్రత్యామ్నాయం కాదని గుర్తించాలని వ్యాఖ్యానించారు. న్యాయవ్యవస్థలో ఏఐ అనుసంధానం చేయాలంటే సమతౌల్యత పాటించాలని అన్నారు. క్లిష్టమైన ప్రశ్నలతో కూడిన ఓ కేసు మీ ముందుకు వస్తే, ఆ సమస్యను పరిష్కరించడానికి మీరు సమయం వెచ్చించి ఆలోచిస్తారని, దానిని పరిష్కరించాక మీరు గొప్ప అనుభూతిని పొందుతారని ఆయన అన్నారు. ఇలాంటి విషయాల్లో ఏఐ సామర్థ్యం సరిపోకపోవచ్చని అభిప్రాయపడ్డారు. కాబట్టి ఏఐ గురించి ఆందోళన అవసరం లేదని అన్నారు. న్యాయాధికారులు ఉత్పాదకతను పెంచడానికి తగిన శిక్షణ తీసుకుంటారని, శ్రద్ధతో పనిచేస్తారని అన్నారు. కానీ ఏఐ డేటా ఆధారంగా పనిచేస్తుందని గుర్తు చేశారు. మనుషులకు ఉండే విచక్షణ శక్తి ఏఐకి ఉండదని, నిర్ణయాలు తీసుకునే సమయంలోనూ మనుషుల్లా ఆలోచించదని తెలిపారు. కేసులను పరిష్కరించడానికి నైతిక విలువలు, సామాజిక కోణాలు, రాజ్యాంగ నియమాలు, విలువల కట్టుబాటు ఉంటాయని, కానీ ఎలాంటి భావోద్వేగాలు లేని ఏఐ వల్ల ఇది సాధ్యం కాదని అన్నారు.

## బీర్ అమ్మకాల్లో బిగ్ ట్విస్ట్

నిరుడు మార్చిలో 39లక్షల బీర్ కేసులు అమ్ముడుపోగా ఈ మార్చిలో రికార్డు స్థాయిలో 50.78లక్షల కేసులు అమ్ముడయ్యాయి. గత ఐదేళ్లలో ఇవే అత్యధికం. కాగా వచ్చే నెలలో బీర్లకు కొరత ఏర్పడే అవకాశం ఉందనే వాదన వినిపిస్తోంది. వేసవిలో బీర్ల అమ్మకాలు గణనీయంగా పెరుగుతున్నాయి. కొత్త రికార్డులు నెలకొల్పుతున్నాయి. ఈ నెలలో ఇప్పటి వరకు 21లక్షల కేసుల విక్రయాలు జరగడం గమనార్హం. ప్రస్తుతం రోజుకు సగటున 1.70లక్షల నుంచి 1.80లక్షల వరకు బీరుకేసులు అమ్ముడుపోతున్నాయి. జనవరి నుంచే బీర్ల అమ్మకాల్లో పెరుగుల కనిపించింది. నిరుడు జనవరిలో 31లక్షల కేసుల బీర్ల అమ్మకాలు జరిగాయి. ఈ జనవరిలో అవి 34 లక్షలకు పెరిగాయి. గత ఏడాది ఫిబ్రవరిలో 28లక్షల కేసులు మాత్రమే అమ్ముడవగా ఈ సారి ఏకంగా 38లక్షల కేసుల విక్రయాలు జరిగాయి. ఎండలు ముదురుతుండటంతో ఫిబ్రవరి చివరి వారం నుంచి బీర్ల విక్రయాలు మరింత పెరిగాయి. మే నెలలో ఇంకా బీర్ల వాడకం పెరిగి నీటి కొరత ఏర్పడితే ఉత్పత్తి పడిపోయి బీర్లకు కొరత ఏర్పడే అవకాశం ఉందని ఎక్సైజ్‌శాఖ అంచనావేస్తోంది.

### వచ్చే నెలలో కొరత ఏర్పడుతుందనే అంచనాలు

బీర్ల తయారీ పరిశ్రమల్లో చాలా వరకు మంజీర నీటిపైనే ఆధారపడతాయి. ప్రస్తుతం ఆ నదిలో నీటిమట్టం భారీగా పడిపోయింది. దీంతో బీరు తయారీ యూనిట్లకు నీటి కష్టాలు మొదలయ్యాయి. ఉత్పత్తి తగ్గితే డిమాండ్‌కు తగ్గట్టుగా సరఫరా చేయలేని పరిస్థితి ఏర్పడే అవకాశం ఉంది. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ఎక్కడ కొరత లేకుండా మద్యం డిపోల నుంచి దుకాణాలకు నిరంతరాయంగా సరఫరా చేసేందుకు గత ఏడాదితో పోల్చితే 10 నుంచి 12 శాతం అదనపు ఉత్పత్తిని సాధించేలా ఎక్సైజ్‌శాఖ చర్యలు చేపట్టింది. సాధారణంగా వేసవి కాలంలో గోదాముల్లో 15 రోజులకు సరిపడ స్టాక్ ఉంచుతారు. ప్రస్తుత డిమాండ్ దృష్ట్యా ఎక్కడా కొరత రాకూడదనే ఉద్దేశంతో ఏకంగా 35 రోజులకు సరిపడా నిల్వలను గోదాముల్లో నిల్వ ఉంచారు. అయినా రోజు రోజుకు పెరుగుతున్న బీర్ల డిమాండ్‌కు తగ్గట్లు భవిష్యత్తులో అందించడం కష్టతరమే అవుతుందని అంచనా వేస్తున్నారు.

## మోదీ కుట్రలు ఓడిపోయాయి

. సమాఖ్య నిర్మాణాన్ని మార్చేసి.. ప్రజాస్వామ్యాన్ని బలహీనపరచాలనే మోదీ సర్కార్ కుట్ర ఓడిపోయిందని పేర్కొన్నారు. ఇది రాజ్యాంగానికి, దేశానికి, ప్రతిపక్షాల ఐక్యతకు లభించిన విజయంగా ఆమె పేర్కొన్నారు. ఈ ఓటమి అధికార పార్టీ నేతల ముఖాల్లో స్పష్టంగా కనిపించిందని తెలిపారు. ఏదో రకంగా అధికారంలో ఉండాలనేది ఎన్డీఏ సర్కార్ కుట్ర అని అందుకే మహిళలను ఉపయోగించుకుని శాశ్వతంగా అధికారంలో ఎలా ఉండాలో ప్లాన్ చేస్తున్నారని ఆరోపించారు. లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందితే తాము గెలుస్తామని ఒక వేళ ఆమోదం పొందకపోతే ప్రతిపక్షాలను మహిళా వ్యతిరేకులుగా ముద్రవేసి వారే మహిళా రక్షకులుగా ప్రచారం చేసుకోవాలని మోదీ సర్కార్ భావించిందని మండిపడ్డారు. ఈ నేపథ్యంలోనే 2023లో అన్ని పార్టీల మద్దతుతో ఏకగ్రీవంగా ఆమోదించబడిన మహిళా రిజర్వేషన్ల బిల్లును తిరిగి తీసుకురావాలని ప్రియాంక గాంధీ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పుడే మహిళలకు హక్కులు కల్పించండి అని పేర్కొన్నారు. డీలిమిటేషన్ వంటి ఇతర అంశాలతో మహిళా రిజర్వేషన్ల బిల్లును ముడిపెట్టి తప్పుదోవ పట్టించకండి అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ ఓటమిని ప్రభుత్వానికి ఒక గట్టి షాక్‌గా అభివర్ణించిన ప్రియాంకా గాంధీ కేవలం ప్రచారం, మీడియా హైప్ ఇకపై పని చేయవని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే మహిళా రిజర్వేషన్లకు తాము వ్యతిరేకం కాదని తేల్చి చెప్పిన ప్రతిపక్షాలు కానీ దాన్ని నియోజక వర్గాల పునర్విభజన (డీలిమిటేషన్), జనాభా గణనతో ముడిపెట్టడాన్ని మాత్రమే వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశాయి.

## మహిళా బిల్లు ఒక్కటే తెస్తే మద్దతిస్తాం

విజయవంతంగా అమలు చేసినందుకు మాకు శిక్ష వేస్తారా అని ప్రశ్నించారు. చంద్రబాబు నాయుడు, ఇతర దక్షిణాది నేతల ఆలోచనలు కూడా ఇదే దిశలో ఉన్నాయని, ప్రాంతీయ హక్కుల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని ఢిల్లీ వేదికగా రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. జనాభా నియంత్రణ, దక్షిణ భారత రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గిపోవడంపై ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలను రేవంత్ రెడ్డి సమర్థించారు. చంద్రబాబు నాయుడు చాలా తెలివైన వారు, అపార అనుభవం గల నేత. ఆయన ఏదీ తప్పుగా చెప్పరు అని రేవంత్ ప్రశంసించారు. జనాభాను పెంచుకోవాలంటూ చంద్రబాబు ఇచ్చిన పిలుపు వెనుక పెద్ద వ్యూహం ఉందని, మోదీ ప్రభుత్వం తెచ్చిన చట్టాలపై ఆయన నేరుగా కాకపోయినా సంకేతాల ద్వారా తన నిరసనను తెలిపారని రేవంత్ విశ్లేషించారు సమఝ్దార్ కో ఇషారా కాఫీ హై తెలివైన వారికి చిన్న సంకేతం చాలు అంటూ ఎన్డీయే మిత్రపక్షాల్లోనే అసంతృప్తి మొదలైందని రేవంత్ చెప్పుకొచ్చారు. తెలంగాణ ఏర్పాటు ప్రక్రియను అవమానించేలా తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలపై రేవంత్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. ఆవు చేనులో మేస్తే.. దూడ గట్టు మీద మేస్తుందా అని ప్రశ్నించారు. గతంలో ప్రధాని మోదీ పార్లమెంటులో తెలంగాణ ఏర్పాటును తల్లిని చంపి బిడ్డను వేరు చేయడం తో పోల్చిన విషయాన్ని గుర్తు చేశారు. పెద్దలే అలా మాట్లాడినప్పుడు, కింద ఉన్న నేతలు అలాగే మాట్లాడుతారని ఎద్దేవా చేశారు. పార్లమెంటులో ఏ బిల్లు ప్రవేశపెట్టినా, ఓటింగ్ సమయంలో తలుపులు మూయడం అనేది ఒక ప్రాథమిక ప్రక్రియ అని, దానిని అవమానంగా చిత్రీకరించడం అజ్ఞానమేనని కొట్టిపారేశారు. రేవంత్ రెడ్డి అటు బీజేపీపై పోరాటాన్ని, ఇటు చంద్రబాబుతో ఉన్న సాన్నిహిత్యాన్ని సమన్వయం చేసుకుంటూ, దక్షిణాది సెంటిమెంట్‌ను బలంగా వినిపించారు.

### సింహం బయటకు వస్తుంటే

## గుంటనక్కల గుండెల్లో దడ

సిల్లీ పాలిటిక్స్ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ జగిత్యాల సభకు వస్తున్నారంటే రేవంత్ రెడ్డి మేడిగడ్డకు వెళుతున్నారని అన్నారు. రెండున్నరేళ్లలో మేడిగడ్డ వెళ్లేందుకు ముఖ్యమంత్రికి సమయం లేదా అని ప్రశ్నించారు. ఇక్కడ కేసీఆర్ కీలక బహిరంగ సభ జరుగుతుంటే టీవీలల్లో కేసీఆర్‌తో పాటు తన మేడిగడ్డ పర్యటన కూడా చూపించాలని, అలాగే పత్రికల్లో పతాక శీర్షికన కేసీఆర్‌తో పాటు తన వార్త రావాలనే చిల్లర ప్రయత్నం రేవంత్ రెడ్డి చేస్తున్నారని ఆరోపించారు. అలాగే జగిత్యాల వచ్చే రోడ్డు మూడేళ్లలో గుర్తుకు రాలేదు కానీ, ఇప్పుడు కేసీఆర్ సభ అనేసరికి రోడ్డును తవ్వేస్తున్నారని మండిపడ్డారు.

కోరుట్ల నుంచి ఎవరూ రాకుండా తవ్వేస్తున్నారని ఆరోపించారు. గతంలో ఎన్నో బహిరంగ సభలు జరిగాయని, ఇప్పుడు కూడా విజయవంతమవుతుందని ధీమా వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి హైట్ మాత్రమే చిన్నది కాదని మెదడు కూడా చిన్నదేనని ఎద్దేవా చేశారు. కాగా, ఎల్లుండి జగిత్యాలలో జరగనున్న బహిరంగ సభలో జీవన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరనున్నారు.

# పద్మారావు నగర్‌లో ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు









**సికింద్రాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్‌లోని కవాడిగూడ సర్కిల్ పరిధిలో శనివారం జిహెచ్ఎంసి అధికారులు విస్తృత స్థాయిలో ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రభుత్వం అమలు చేస్తున్న “99 రోజుల ప్రత్యేక కార్యక్రమం”లో భాగంగా ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. పద్మారావు నగర్ ప్రాంతంలో ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారం నిర్వహిస్తున్న టీ షాపులు, తాత్కాలిక షెడ్‌లు, అక్రమంగా నిల్వ చేసిన షెడ్లు ఇతర వ్యాపార సామాగ్రిని జిహెచ్ఎంసి సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా కొన్ని అక్రమ నిర్మాణాలను ధ్వంసం చేసి, అక్కడి ప్రాంతాన్ని స్వచ్ఛంగా మార్చారు. ఈ కార్యక్రమంలో కవాడిగూడ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ పుష్పలత, ఎసిపి శ్రీనివాస్, సెక్షన్ ఆఫీసర్ కిష్టయ్య, సిసిపి జిహెచ్ఎంసి సిబ్బంది పాల్గొన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఉండేందుకు, ప్రజలకు సౌకర్యంగా ఫుట్‌పాత్‌లు అందుబాటులో ఉండేలా ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఫుట్‌పాత్‌లను ఆక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## దళితుల ఆత్మగౌరవాన్ని

# గాయపరిచే ఏ ఒక్కడినీ వదలం

### సామాజిక సంక్షేమ బోర్డు చైర్మన్ పోతుల బాలకోటయ్య హెచ్చరిక

సోషల్ మీడియాలో నొటికొచ్చినట్లు వ్యక్తిత్వ హననం చేస్తూ, దళితుల ఆత్మగౌరవాన్ని నీచమైన పదజాలాలతో కించపరిచే సోషల్ మీడియా రాబందులను ఏ ఒక్కడినీ వదలబోమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సామాజిక సంక్షేమ బోర్డు చైర్మన్ పోతుల బాలకోటయ్య హెచ్చరించారు. శనివారం ఆయన మీడియాకు ప్రకటన విడుదల చేశారు. ఇటీవల సంక్షేమ బోర్డును ముష్టి బోర్డుగా, ఎస్సీ, ఎస్టీ ఆత్మగౌరవాన్ని కించపరుస్తూ వైకాపా నాయకులు పెట్టిన పోస్ట్ పై తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఎస్సీ సామాజిక కులాలపై పరుష పదజాలంతో దాడి చేసిన వారిని రెండు, మూడు రోజుల్లో చట్టం ముందుకు తీసుకురానున్నట్లు స్పష్టం చేశారు. ఇప్పటికే సోషల్ మీడియాలో అభ్యంతరకరమైన పోస్ట్ ల పట్ల ప్రభుత్వం చాలా కఠినంగా వ్యవహరించాలన్న నిర్ణయం తీసుకున్నట్లు గుర్తు చేశారు. రాష్ట్రంలో అణగారిన కులాల ఆత్మగౌరవాన్ని భంగపరిచే సామాజిక వైషమ్యకారులపై కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని బాలకోటయ్య అభిప్రాయపడ్డారు

# జలసంరక్షణ మనందరి బాధ్యత

### – ఎమ్మెల్యే ఆరణి.



జల సంరక్షణ మనందరి బాధ్యత అని, ఆ దిశగా అందరూ కృషి చేయాలని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర లో భాగంగా శనివారం చెన్నారెడ్డి కాలనిలోని కృష్ణమ నాయుడు పుష్కరిణి జలధార – జల హారతి కార్యక్రమాన్ని నిర్వహించి హారతులు సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి శనివారం రాష్ట్ర ప్రభుత్వం పిలుపు మేరకు జలధార – జల హారతి కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. ప్రతి శనివారం ఒక నినాదంతో ముందుకు వచ్చి ప్రజల్లో శుభ్రతపై చైతన్యం కలిగితున్నామని తెలుప్పారు. ఈ నెల వర్షపు నీటి పరిరక్షణ, ఇంకుడు గుంతల ఏర్పాటు, భూగర్భ జలాల పరిరక్షణ పై ప్రజలకు అవగహన కల్పిస్తున్నామని తెలిపారు. స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర లో అందరూ భాగస్వాములై పరిసరాల పరిశుభ్రతతో పాటు ఇండ్లు కూడా శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. అదనపు కమిషనర్ శారదా దేవి మాట్లాడుతూ నీటి పరిరక్షణతో మానవ మనుగడ సాధ్యమని, నీరు ఎక్కడ అందుబాటులో ఉంటే అక్కడ అభివృద్ధి జరిగితుందని తెలిపారు. భూగర్భ జలాల పెంపు, వర్షపు నీటిని నిల్వ చేసేందుకు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. వీటిపై అవగాహన కల్పిస్తూ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో కృష్ణమ నాయుడు పుష్కరిణిలో జలధార – జలహారతి కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. వేసవిలో నీటిని వృధా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, మాజీ డిప్యూటీ మేయర్ ఆర్.సి.మునికృష్ణ, నరేంద్ర, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవిన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, హార్టికల్చర్ ఆఫీసర్ హరికృష్ణ, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఏకకాలంలో పాన్ షాపులు, కిరాణా దుకాణాలలో పోలీసుల తనిఖీలు




**హైదరాబాద్** నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ఆదేశాల మేరకు నగరంలోని పాన్ షాప్ లు, కిరాణాదుకాణాలలో పోలీసులు ఏక కాలంలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. బ్యాండ్ చేసిన నిషేధితమైన గుట్కా ప్యాకెట్లను సిగరెట్ డబ్బాలతో పాటు మరికొన్ని వస్తువులు అక్రమంగా అమ్ముతుండడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు.ముఖ్యంగా స్కూల్ సమీపంలో ఉన్న పాన్ షాపులను టార్గెట్ చేసి వారి వద్ద నుండి పెద్ద ఎత్తున గుట్కాలు పాన్ మసాలాలు స్వాధీన పరుచుకొని వారిపై కేసులు నమోదు చేశారు.నిషేధిత మరక ద్రవ్యాలు,గుట్కాలు,పాన్ మసాలాలు సెల్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సజ్జనార్ హెచ్చరించారు.

# పద్మారావునగర్‌లో కూల్చివేతలు

**సికింద్రాబాద్..**పద్మారావు నగర్ ,గాంధీ ఆసుపత్రి పరిసర ప్రాంతాల్లో ఫుట్ పాత్ లపై వెలసిన ఆక్రమణలను జిహెచ్ఎంసి ప్రాఫిట్ అధికారులు సంయుక్తంగా తొలగించారు. పాదచారుల రాకపోకలకు ఇబ్బందిగా మారిన షెడ్లు, తాత్కాలిక దుకాణాలు, నిర్మాణ సామగ్రిని జేసీబీల సహాయంతో క్లియర్ చేశారు. ట్రాఫిక్ సమస్యలు పెరగడంతో పాటు ప్రజలు రోడ్డుపై నడవాల్సిన పరిస్థితి రావడంతో ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. స్థానిక మున్సిపల్, ట్రాఫిక్, పోలీస్ శాఖలు సంయుక్తంగా ఈ ఆపరేషన్ చేపట్టాయి...

# అసెంబ్లీ గేటు ముందు బీజేవైఎం అందోళన

**హైదరాబాద్**(మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ మద్దతు ఇవ్వడం లేదని ఆరోపిస్తూ, తెలంగాణా అసెంబ్లీ గేట్–1 వద్ద బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ కుండే ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. గోల్కొండ జిల్లా అధ్యక్షుడు నితిన్ నందకర్ సహా బీజేవైఎం నాయకులు కాంగ్రెస్ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.దీంతో అక్కడ ఉద్రిక్తత చోటు చేసుకుంది.

## మద్యం దుకాణాలను తనిఖీ చేసిన

# మంత్రి కొల్లు రవీంద్ర

**గుంటూరు** గుంటూరు నగరంలో గత కొద్దిరోజులుగా మద్యం దుకాణాలపై వస్తున్న కథనాలపై మంత్రి కొల్లు రవీంద్ర స్పందించారు.గుంటూరు నగరంలోని నగరాలు ప్రాంతంలో ఉన్న విజయ శ్రీ వైన్స్ ను ఆకస్మికంగా తనిఖీ చేసి పలు మద్యం ఉత్పత్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన దుకాణాల్లోని మద్యం నాణ్యతను, నిల్వలను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా నాణ్యమైన మద్యం మాత్రమే విక్రయించాలని, నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు.

# రూ 83 కోట్లతో 706 ఆలయాల నిర్మాణాలు

**నెల్లూరు** కూటమి పాలనలో నిధుల కొరత లేదని, 83 కోట్లతో రాష్ట్రంలోని 706 ఆలయాల నిర్మాణ పనులు త్వరలో ప్రారంభిస్తామని దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా పెంచలకోన బ్రహ్మోత్సవాల సమీక్షలో మంత్రి ఆనం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 679 భజన మందిరాలను మంజూరు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని చెప్పారు. త్వరలో సీఎం చంద్రబాబు నేతృత్వంలో గోదావరి పుష్కరాలు జరగనున్నాయని, ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే మూడు సార్లు జరగడం ఆంధ్రులందరికీ గర్వకారణంగా ఉందన్నారు. 5,900 చిన్న ఆలయాల్లో ధూపదీప నైవేద్య ఖర్చుల కింద నెలకు (ఒక్కో ఆలయానికి) రూ.10 వేల చొప్పున రూ.6.17 కోట్లు ఇస్తున్నామని తెలిపారు. కూటమి పాలనలో గ్రామాల్లోని ఆలయాలకు భక్తుల తాకిడి 70 నుంచి 75 శాతం పెరిగిందని వివరించారు. రాష్ట్రంలో జరిగే బ్రహ్మోత్సవాలకు తనతో పాటు హోంమంత్రి వంగలపూడి అనిత, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో కమిటీని సీఎం నియమించారని పేర్కొన్నారు.

# పెన్నానది తీరాన భక్తి వెలుగులు

### – శ్రీ నారాపుర వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల వైభవోత్సవం



**తిరుపతి,** జమ్మలమడుగులో ఏప్రిల్ 30 నుండి మే 10వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలుకడప జిల్లా జమ్మలమడుగులోని శ్రీ నారాపుర వేంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 30 నుండి మే 10వ తేదీ వరకు భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించనున్నారు. ఏప్రిల్ 30న అంకురార్పణంతో ఈ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమవుతాయి.బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రతిరోజూ ఉదయం 8 గంటలకు, రాత్రి 7 గంటలకు స్వామివారి వాహనసేవలు జరుగుతాయి. మే 10వ తేదీన సాయంత్రం 6 గంటలకు పుష్పయాగంతో ఉత్సవాలు ముగుస్తాయి.

## ఏప్రిల్ 25న ఒంటిమిట్టలో

# శ్రీ సీతమ్మవారి జయంతి మహోత్సవం

**కడప** ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామ స్వామి ఆలయంలో ఏప్రిల్ 25వ తేదీన శ్రీ సీతమ్మవారి జయంతి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈ పర్వదినం సందర్భంగా ఆలయం భక్తి పరవశంతో నిండిపోనుంది.ఈ సందర్భంగా 25వ తేదీ శనివారం ఉదయం 5.30 గంటల నుండి 7.30 గంటల వరకు పలు వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. కార్యక్రమాలు ఆలయ ప్రదక్షిణతో ప్రారంభమై, భగవత్ అనుజ్ఞ, విష్వక్సేన ఆరాధన, వాసుదేవ పుణ్యాహవచనం నిర్వహిస్తారు. అనంతరం స్వామివారి విశేష ఆరాధన, అమ్మవారికి వసంతిక పూజ, సహస్రనామార్చన భక్తిశ్రద్ధలతో సాగుతాయి.తదనంతరం నివేదన, మహా మంగళహారతి, వేదస్వస్తి, సాత్తుమొర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనున్నారు.ఈ పుణ్యదినాన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ సీతమ్మవారి అనుగ్రహం, కృపాకటాక్షాలను పొందాలని టిటిడి ఆకాంక్షిస్తోంది.

# గ్రీన్ స్టీల్ ప్లాంట్‌కు వినతి

ఏర్పాటు చేస్తే జరిగే ప్రయోజనాలను వివరించారు. బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్ (ఉక్కు పరిశ్రమ) ఏర్పాటు చేయాలని ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి.కుమారస్వామికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. గ్రీన్‌స్టీల్ ప్లాంట్ ఏర్పాటుతో ఉక్కు కొరత తగ్గడంతో పాటు పర్యావరణానికి మేలు కలుగుతుందని తెలిపారు. ఢిల్లీలో కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి.కుమారస్వామి, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మలతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి శనివారం ఉదయం సమావేశమయ్యారు.అదే సమయంలో కాంగ్రెస్ సర్కార్ తెలంగాణ రైజింగ్––2047 విజన్‌లో భాగంగా తయారు చేసిన పారిశ్రామిక ప్రతిపాదనలను కూడా కేంద్రమంత్రులకు సీఎం రేవంత్ రెడ్డి అందించి వివరించారు. తెలంగాణలో పాత వాహనాల ద్వారా వచ్చే స్క్రాప్‌తో ఉక్కును రీసైకిల్ చేసే ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అందుబాటులో ఉన్న టెక్నాలజీ, భారీ పరిశ్రమలు, పారిశ్రామిక ఉత్పత్తికి ఉన్న అనుకూలతల కారణంగా దేశ పారిశ్రామిక ఉత్పత్తి లక్ష్యాలకు హైదరాబాద్ నగరం ఒక కేంద్రంగా నిలుస్తుందని కేంద్రమంత్రులకు రేవంత్ రెడ్డి వెల్లడించారు.అదే సమయంలో హైడ్రోజన్ టెక్నాలజీతో గ్రీన్ స్టీల్ క్లస్టర్, ఆటో, రక్షణ రంగాలకు అవసరమైన ఉత్పత్తుల తయారీ పరిశ్రమలు ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ)కొనుగోళ్లు భారీగా పెరుగుతున్న నేపథ్యంలో హైదరాబాద్‌లో ఈవీ బ్యాటరీల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కేంద్రమంత్రులు కుమారస్వామి, శ్రీనివాస వర్మలను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. మరోవైపు మెషిన్ టూల్స్, రోబోటిక్స్ వంటి అత్యాధునిక పరికరాల తయారీకి స్పెషల్ పార్క్‌ను కూడా ఏర్పాటు చేయాలని కేంద్రమంత్రులకు సీఎం విజ్ఞప్తి చేశారు. 2034 నాటికి హైదరాబాద్‌ను కాలుష్య రహిత నగరంగా మార్చే లక్ష్యంతో వాహనాలను ఎలక్ట్రిక్ వెహికల్స్‌గా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వానికి సహకరించాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. అత్యాధునిక పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు అవసరమైన స్కిల్స్‌ను నేర్పించే నేషనల్ లెవల్ సంస్థలను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలని కేంద్రమంత్రులకు రేవంత్ రెడ్డి సూచించారు.

# ఉపాధి కూలీలకు ఫేస్ హాజరు రద్దు చేయండి

### – సిఐటియు డిమాండ్

**అరకులోయ** కేంద్రంలో ఉన్న బిజెపి ఎన్ డిఏ కూటమి ప్రభుత్వం ఇటీవల కాలంలో ఉపాధి హామీ పథకం చట్టాన్ని మార్పులు చేసి పేద కూలీల పొట్టలు కొట్టే విధంగా మార్పులు చేసిందని సిఐటియు అల్లూరి జిల్లా సహాయ కార్యదర్శి జె భగత్ రాం తెలిపారు శనివారం మండలంలో పద్మపురం పంచాయతీ దుమ్మగూడ ఉపాధి కూలీలతో కలిసి పని ప్రదేశంలో పెద్ద ఎత్తున నిరసన తెలియజేశారు. పేస్ హాజరు వలన గిరిజన ప్రాంతంలో కూలీలకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు ఈ విధంగా పని ఉంటే చేసిన కూలి పనికి సక్రమంగా కూలీలు వచ్చే అవకాశం లేదని తెలిపారు

అదేవిధంగా గతంలో కేంద్రం ఇచ్చే వాటా తగ్గించడం వలన రాష్ట్రాలపై భారం పడే అవకాశం ఉందని దీంతో రాష్ట్రాలు ఉపాధి కూలీలు సంబంధించిన పనులు కల్పించడంలో బకాయి కూలీలు చెల్లించడంలో అలసత్వం వహిస్తాయని దీంతో ఉపాధి కూలీలు మనకి దూరమయ్యే అవకాశం ఉందని తెలిపారు కావాలని ఉపాధి చట్టాన్ని ఎత్తివేసేందుకే కేంద్రంలో ఉన్న బిజెపి ఈ కుట్ర చేసిందని తెలిపారు తక్షణం ఉపాధి హామీ పథకాన్ని పాత పద్ధతిలో కొనసాగించాలని డిమాండ్ చేశారు లేకుంటే సిఐటియు ఉపాధి కార్మిక సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసనలు తెలియజేస్తామని కేంద్ర ప్రభుత్వానికి హెచ్చరిక చేశారు.

## ఘనంగా ఆదిత్యల పాఠశాలో

# గ్రాడ్యుయేషన్ డే

**కోదాడ** కోదాడలోని ఆదిత్య పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు గ్రాండ్ గా సెలబ్రేషన్ చేశారు ఇట్టి కార్యక్రమంలో కోదాడ ఎంఈఓ సలీం షరీఫ్ హాజరయ్యా కార్యక్రమాన్ని అనుసరించి పిల్లల్లో నైపుణ్యాన్ని పెంపొందించి స్కిట్స్ ను డెవలప్ చేసి అనేక విధాలుగా పిల్లల్ని అభివృద్ధి బాటలో నడిపించాలని పిల్లలకు తెలియజేశారు తెలియజేశారు ఉపాధ్యాయులు విద్యాభివృద్ధిని చాటుకోవాలని పిల్లలకి తెలియజేశారు ఇట్టి కార్యక్రమంలో పిల్లలు డ్యాన్సులతో పాటలతో అలరించారు

ఇట్టి కార్యక్రమాన్ని ఎంఈఓ ఎంత అభినందించారు పిల్లలకు వేడుక సందర్భంగా అభినందనలు తెలియజేసి సర్టిఫికెట్స్ ప్రధానం చేశారు ఈ వేడుకలో హాజరై పిల్లలకు అభినందనలు తెలిపినందుకుగాను పాఠశాల యజమాన్యం తరఫున కరస్పాండెంట్ అయినది మరియు పాఠశాల సిబ్బంది ఎంఈఓ సలీం షరీఫ్ గారికి ధన్యవాదాలు తెలియజేశారు ఇంటి కార్యక్రమంలో పాఠశాల కర్రీస్పాండెంట్ హైందవి మాట్లాడుతూ పిల్లలకు అన్ని విధాల చదువులకు సంబంధించి ప్రతి ఒక్కటి సమకూర్చి ఆదిత్య స్కూల్ ని అభివృద్ధి బాటలో నడిపిస్తానని ఇట్టి కార్యక్రమంలో వారు తెలియజేశారు ఈ కార్యక్రమంలో టీచర్ల బృందం స్కూల్ కరస్పాండెంట్ అయినది ప్రిన్సిపాల్ గూడూరు అంజని ఇట్టి కార్యక్రమాన్ని గురించి పిల్లలందరికీ తెలియజేశారు ఇట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

## మహిళా సాధికారతకు

# కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**విజయవాడ** విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీకనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్న అనంతరం రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మహిళా సాధికారతపై తన అభిప్రాయాలను వెల్లడించారు. మహిళా బిల్లు పార్లమెంట్లో ఆమోదం పొందితే మహిళలకు రాజకీయంగా మరింత బలం చేకూరేదని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. శనివారం మంత్రి పుట్టినరోజు సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కి ఆలయ ఈవో వీకే శీనా నాయక్ స్వాగతం పలకగా ఆలయ పండితులు ఆశీర్వచనాలు అందించి ప్రత్యేక పూజలు అనంతరం ప్రసాదం అందజేశారు. అనంతరం మంత్రి కొలుసు పార్థ సారథి మీడియాతో మాట్లాడుతూ... తన పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన అభిమానులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. మహిళా సాధికారత దిశగా మహిళా బిల్లు కీలకమని, అది ఆమోదం పొందుతుందని ఆశించామని చెప్పారు. ఆ బిల్లు ఆమోదం పొందితే తన పుట్టినరోజు మరింత ఆనందంగా ఉండేదని అభిప్రాయపడ్డారు.

# రేషన్ బియ్యం అక్రమ రవాణా పట్టివేత

### – దాదాపు 4వేల మెట్రిక్ టన్నుల బియ్యం పట్టినట్లు అంచనా



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** పెద్ద గోల్కొండలో భారీ స్థాయిలో జరుగుతున్న రేషన్ బియ్యం అక్రమ రవాణాకు అధికార యంత్రాంగం గట్టి చెక్ పెట్టింది. విశ్వసనీయ సమాచారం ఆధారంగా ఎన్ఫోర్స్మెంట్ అధికారులు దాడులు నిర్వహించి దాదాపు 4 వేల మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆపరేషన్ ఎన్ఫోర్స్మెంట్ డీఎస్పీలు రమేష్ ఆధ్వర్యంలో జరిగింది. దాడుల్లో అధికారులు రామకృష్ణ, మహేష్ కుమార్, జంగయ్య, నర్సింగ్ నాయక్ తదితరులు పాల్గొని వివిధ గోదాములు, అనుమానాస్పద నిల్వ కేంద్రాలను తనిఖీ చేశారు. ప్రభుత్వం పేదల కోసం సరఫరా చేస్తున్న పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసి, అధిక ధరలకు మార్కెట్లో విక్రయించే ప్రయత్నం చేస్తున్న మాఫియా గుట్టు ఈ దాడులతో రట్టు అయింది.సీజ్ చేసిన బియ్యాన్ని అధికారులు సురక్షిత ప్రదేశాలకు తరలించి, కేసులు నమోదు చేసే ప్రక్రియను ప్రారంభించారు. ఈ ఘటనలో పాలుపంచుకున్న కీలక వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. రేషన్ బియ్యం దందాను అరికట్టేందుకు ఇలాంటి దాడులు నిత్యం కొనసాగుతాయని డీఎస్పీ రమేష్ స్పష్టం చేశారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలపై దాడి చేస్తున్న ఈ అక్రమ రవాణా వ్యవహారంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడైనా అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే సమాచారాన్ని అందించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## గజ్వేల్‌లో కో-ఆప్షన్ మెంబర్ పదవికి
# రజియా బేగం దరఖాస్తు

**13 ఏళ్ల సేవలకు గుర్తింపు ఇవ్వాలంటూ అధిష్టానానికి విజ్ఞప్తి**



గజ్వేల్(ప్రశ్న న్యూస్) గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో కో-ఆప్షన్ మెంబర్ పదవికి బీఆర్ఎస్ పార్టీ టౌన్ మహిళా విభాగం జనరల్ సెక్రటరీ శ్రీమతి రజియా బేగం దరఖాస్తు సమర్పించారు. గత 13 సంవత్సరాలుగా పార్టీ కోసం అహర్నిశలు కృషి చేస్తూ, ప్రతి ఎన్నికల్లో, ప్రతి సమావేశంలో చురుకైన పాత్ర పోషించినట్లు ఆమె పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి నిరంతరం శ్రమించిన తన సేవలను గుర్తించి, కో-ఆప్షన్ మెంబర్‌గా అవకాశం కల్పించాలని పార్టీ అధిష్టానాన్ని ఆమె మనస్ఫూర్తిగా కోరారు.

# ఆర్టీసీని ప్రైవేటు పరం చేసే కుట్రలు ఆపాలి

**ముషీరాబాద్ డిపో ముందు ఆర్టీసీ కార్మికుల గేట్ మీటింగ్**



ముషీరాబాద్(ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ జేఏసీ ఇచ్చిన పిలుపు లో భాగంగా సమ్మె సన్నాహక కార్యక్రమం లో ఆర్టీసీని ప్రైవేటువరం చేసే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఆరోపిస్తూ ముషీరాబాద్ ఆర్టీసీ డిపో ముందు కార్మికులు శనివారం గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సంద ర్భంగా డిపో జేఏసి నాయకులు జి పి ఆర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకాన్ని ఆర్టీసీ కార్మికులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటూ విజయవంతంగా అమలుచేస్తూ ప్రభుత్వా నికి మంచిపేరు తీసుకువస్తున్నారని తెలిపారు. ఈ పథకం అమలుతో డ్రైవర్లు, కండక్టర్లపై పని ఒత్తిడి విపరీతంగా పెరిగిందని, రద్దీ బస్సులో అనుకోకుండా చిన్న చిన్న తప్పిదాలు జరిగితే కార్మికులను ఉద్యోగాల నుండి తొలగించడం అన్యాయమని మండిపడ్డారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన ప్రభుత్వమే ఆర్టీసీకి చెందిన భూములు, ఆస్తులు, వర్క్ షాప్ లము డిపోలను ప్రైవేట్ వ్యక్తు లకు అప్పగించే ప్రయత్నాలు చేస్తోందని రాష్ట్ర జేఏసీ నాయకులు గోపాల్ ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేయాలని , సమ్మె లోకి పోకుండా అధికారులు సంతకాలు చేయిస్తున్నారని, కార్మికులు ఎవ్వరు కూడా సంతకాలు పెట్టొద్దని మలాకర్ గౌడ్ డిమాండ్ చేశారు. తమ హక్కుల కోసం, ఆర్టీసీ ఆస్తులను కాపాడుకునేందుకు పోరాటం తప్పదని అన్నారు. 22న ఆర్టీసీ బంద్ కు ప్రజలు సహకరించాలని జేఏసీ కో కన్వీనర్ సుద్దాల సురేష్ తెలిపారు. ఎలక్ట్రికల్ వాహనాలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలనీ, డిపో జేఏసీ నాయకులు కృష్ణ నేత పేర్కొన్నారు.కార్యక్రమంలో జేఏసి నాయకులు రావినాద్, మొహమ్మద్ మోసిన్,, అరుణ్ కుమార్, కె ఎన్ రావు, కైలాసం, ఎస్ డబ్లు ఎఫ్ లింగయ్య రవి, అగమైయ్యా, మోహన్ రావు, కృష్ణ, రవి, సంతోష్, మైసయ్య, పాల్గొన్నారు.

## అలిపిరి మెట్టు మార్గంలో తప్పిపోయిన
# బాలుడు సురక్షితంగా అప్పగింత



తిరుమల (ప్రశ్న న్యూస్) తమిళనాడు రాష్ట్రం చంగల్ పట్టు ప్రాంతానికి చెందిన 12 సంవత్సరాల ఆదర్శ్ అనే బాలుడు అలిపిరి మెట్ల మార్గంలో సుమారు 2500వ మెట్టు వద్ద తప్పిపోయిన విషయం టీటీడీ విజిలెన్స్ కమాండ్ కంట్రోల్ రూమ్‌కు తెలిసింది. వెంటనే స్పందించిన ఏవీఎస్వోలు సిబ్బందిని అప్రమత్తం చేసి విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో తిరుమలలోని ప్రాంతంలో బాలుడు కనిపించినట్లు విజిలెన్స్ మరియు సెక్యూరిటీ సిబ్బంది గుర్తించారు.అనంతరం ఆదర్శ్‌ను సురక్షితంగా లేపాక్షి సర్కిల్‌లోని విజిలెన్స్ కార్యాలయానికి తీసుకువచ్చి ఏవీఎస్వో వెంకట శివ కుమార్, కృష్ణయ్య సమక్షంలో అతని బంధువులకు అప్పగించారు.ఈ సందర్భంగా టీటీడీ విజిలెన్స్ సిబ్బందికి బాలుడి బంధువులు కృతజ్ఞతలు తెలియజేశారు.తప్పిపోయిన బాలుడిని త్వరితగతిన గుర్తించి సురక్షితంగా అప్పగించిన విజిలెన్స్ సిబ్బందిని టీటీడీ ఉన్నతాధికారులు అభినందించారు.

## కాయకల్ప ప్రమాణాలతో ఆస్పత్రిలో
# మెరుగైన సేవలు అందించాలి

**- డాక్టర్ శ్రీనివాస ప్రసాద్**

**( డీసీఎస్ నిజామాబాద్)**



గజ్వేల్ (ప్రశ్న న్యూస్) సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో కాయకల్ప కార్యక్రమం అమలును పరిశీలించేందుకు డాక్టర్ శ్రీనివాస ప్రసాద్ (డీసీఎస్, నిజామాబాద్) శనివారం విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ప్రాంగణం, ఓపీ విభాగం, ఇన్‌పేషెంట్ వార్డులు, ప్రసూతి విభాగం, అత్యవసర విభాగం, ల్యాబ్, ఫార్మసీ, శౌచాలయాలు, వంటశాల, తాగునీటి సదుపాయాలు తదితర విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అధికారులు మాట్లాడుతూ ఆసుపత్రిలో పరిశుభ్రత, పారిశుధ్యం, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణను మరింత పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. రోగులు ఆసుపత్రికి వచ్చినప్పటి నుంచి చికిత్స పూర్తయ్యే వరకు ప్రతి దశలో సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా వార్డులు, బెడ్లు, బెడ్‌షీట్లు, శౌచాలయాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, శానిటేషన్ పనులు నిరంతరం కొనసాగించాలని సిబ్బందికి ఆదేశించారు. ఆసుపత్రి ప్రాంగణంలో చెత్త పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని, వ్యర్థాలను రంగుల బిన్‌లలో వేరు చేసి నిబంధనల ప్రకారం సురక్షితంగా తరలించాలని సూచించారు. రోగులకు అందిస్తున్న సేవల నాణ్యత, మందుల లభ్యత, వైద్య పరికరాల వినియోగం, శుద్ధి చేసిన తాగునీటి సదుపాయం, పారిశుధ్య సిబ్బంది పనితీరును సంతృప్తికరంగా ఉందని కొనియాడారు. అదనంగా, రోగులు మరియు వారి బంధువులు ఇబ్బందులు ఎదుర్కొనకుండా సహాయక సిబ్బంది మర్యాదపూర్వకంగా స్పందించాలని, ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. కాయకల్ప ప్రమాణాలను పూర్తిస్థాయిలో అమలు చేస్తే ఆసుపత్రి సేవల్లో గణనీయమైన మెరుగుదలతో పాటు ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఈ తనిఖీల్లో డాక్టర్ శ్రీనివాస ప్రసాద్, డాక్టర్ రాజ్‌కుమార్ రాజు (ఇబ్రహీంపట్నం సూపరింటెండెంట్), గజ్వేల్ జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ శ్రీధర్ (ఆర్ఎంఓ), డాక్టర్ ప్రణితి, నర్సింగ్ సూపరింటెండెంట్ సువర్ణ, ఫార్మసీ ఆఫీసర్ విమల, ఎఫ్‌సిబా శ్రీనివాస చారి, మోహన్ బండారి, సానిటరీ ఇన్స్పెక్టర్ లక్ష్మి, ఇన్ఫెక్షన్ కంట్రోల్ నర్సింగ్ ఆఫీసర్లు మేహారాజ్ భాను, రజిత, హెడ్ నర్సులు జగదాంబ, ఉమామహేశ్వరి, వకుల దేవి, నిర్మల, పుష్ప, హెల్త్ అసిస్టెంట్లు దేవసాని వాసుదేవ్, కృష్ణవేణి, ఇమ్యునైజేషన్ విభాగం లత, కనుక లక్ష్మి, భారతమ్మ, ఈసీజీ టెక్నీషియన్ రాజు, ఆరోగ్యశ్రీ ఇన్‌చార్జ్ సురేందర్, సంతోష్, కనకయ్యతో పాటు పారిశుధ్య సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మూగ నోముకు మధుర స్వరం : టీటీడీ.

**శ్రవణంతో చిన్నారుల భవిష్యత్తుకు వెలుగులు నింపుతున్న టిటిడి**

**శ్రవణంను పరిశీలించిన టిటిడి జేఈవో (వైద్యం , విద్య) డా. ఎ. శరత్**



తిరుపతి (ప్రశ్న న్యూస్) టిటిడి ఆధ్వర్యంలోని శ్రీ వేంకటేశ్వర శ్రవణం సంస్థను టిటిడి జేఈవో (వైద్యం విద్య) డా. ఎ. శరత్ శనివారం అధికారులతో కలిసి సమగ్రంగా పరిశీలించారు. చిన్నారుల జీవితాల్లో శ్రవణం ద్వారా వస్తున్న మార్పులను ప్రత్యక్షంగా తెలుసుకొని, సేవల మరింత మెరుగుదలకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా టిటిడి ఆధ్వర్యంలోని శ్రీ వేంకటేశ్వర శ్రవణం, శ్రీ వేంకటేశ్వర బాలమందిరం సంస్థలలో అందిస్తున్న సేవలను విస్తృతంగా ప్రజలకు చేరవేయాలని జేఈవో సూచించారు. టిటిడి సమాచార కేంద్రాలు, కల్యాణ మండపాలు, ఎస్వీబీసీ ఛానల్, టిటిడి సోషల్ మీడియా, జిల్లా చైల్డ్ వెల్ఫేర్ దివ్యాంగుల శాఖలతో సమన్వయం చేసుకుని ప్రచారాన్ని విస్తరించాలని ఆదేశించారు. 2026--2027 విద్యాసంవత్సర ప్రవేశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, సెలవులు ముగిసేలోపు పెండింగ్ అభివృద్ధి పనులను పూర్తిచేయాలని సంబంధిత అధికారులను కోరారు.పిల్లల తల్లులతో మమేకమై మాట్లాడిన జేఈవో, నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం ఆహారం అందుతున్నదా, శిక్షణ నాణ్యత ఎలా ఉందో, పిల్లలలో వచ్చిన పురోగతి, సౌకర్యాలపై సంతృప్తి స్థాయి వంటి అంశాలను తెలుసుకున్నారు. పలు ప్రాంతాల నుండి వచ్చిన తల్లులు శిక్షణపై పూర్తి సంతృప్తి వ్యక్తం చేస్తూ, “మూగ నోముతో వచ్చాం… నవ్వు నోముతో వెళ్తున్నాం” అని భావోద్వేగంగా తెలిపారు.ఈ సందర్భంగా తరగతి గదుల్లో ఆధునిక వసతులు, డిజిటల్ క్లాసులు ఏర్పాటు చేయాలని జేఈవో సూచించారు. డే స్కాలర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన సదుపాయం కల్పించడం, శిక్షణ అనంతరం ఆధునిక వినికిడి పరికరాల పంపిణీ, మెరుగైన బోధనాంశాలు, బోధనా పద్ధతులు, స్టేషనరీ, స్టడీ మెటీరియల్, పాఠ్యాంశాలపై డిఈవో టి. వెంకట సునీల్‌కు దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో డిఎఫ్వో డి. ఫణికుమార్ నాయుడు, డిఈవో టి. వెంకట సునీల్, అదనపు ఆరోగ్య అధికారి డా. సునీల్, శ్రవణం ప్రాజెక్ట్ ఏఈవో అమ్ములు, ఈఈ మల్లికార్జున ప్రసాద్, ఇతర అధికారులు, శ్రవణం సిబ్బంది పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ సూరన్నకు పెళ్లిరోజు శుభాకాంక్షలు
## శాలువాతో సత్కరించిన జర్నలిస్టులు



తార్నాక (ప్రశ్న న్యూస్) ఉస్మానియా యూనివర్సిటీ ప్రాంగణంలో శనివారం ఓ ప్రత్యేకమైన సందడి కనిపించింది.ఫైర్ బ్రాండ్ జర్నలిస్టులు కలిసి సూరన్నకు పెళ్లి రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. సమాజ సమస్యలపై ఎప్పుడూ ముందుండే సూరన్నకు, ఈ రోజు వ్యక్తిగతంగా ఎంతో ముఖ్యమైన రోజని ఆయన జీవిత భాగస్వామితో కలిసి సాగిస్తున్న ప్రయాణం ఆదర్శప్రాయమని వారు అన్నారు. పోరాటస్ఫూర్తి ఉన్న వ్యక్తిగా, నిజాయితీ గల జర్నలిస్టుగా సూరన్న పేరు తెచ్చుకున్నారు.అటువంటి వ్యక్తికి జీవిత భాగస్వామి ఇచ్చే సహకారం ఎంతో గొప్పదని అభిప్రాయపడ్డారు.జ్యోష్ణ (సోనా) అండతోనే సూరన్న తన ప్రయాణాన్ని విజయవంతంగా కొనసాగిస్తున్నారని తెలిపారు.ఇద్దరి మధ్య ఉన్న అర్థం, ప్రేమ మరింత బలపడాలని ఆకాంక్షించారు.మీడియా రంగంలో ఎన్ని ఒత్తిడులు వచ్చినా, కుటుంబం ఒక బలమైన అండగా ఉంటుందని గుర్తుచేశారు.అందుకే ఈ బంధాన్ని మరింతగా కాపాడుకోవాలని సూచించారు.సూరన్న-జ్యోష్ణ దంపతులకు ఆయురారోగ్యాలతో నిండిన సుఖసంతోషాల జీవితం కలగాలని ఆశీర్వదించారు. ఇంకా ఇలాంటి పెళ్లి రోజులు ఎన్నో జరుపుకోవాలని కోరుకున్నారు.ఈ సందర్భంగా అక్కడ ఉన్న వారంతా చప్పట్లతో అభినందనలు తెలిపారు.స్నేహితులు, సహచరులు కలిసి ఈ వేడుకను మరింత ఆనందంగా మార్చారు.“హ్యాపీ మ్యారేజ్ అనివర్సరీ సూరన్న ” అంటూ అందరూ ఒకే స్వరంతో శుభాకాంక్షలు తెలిపారు.

## అగ్నిమాపక వారోత్సవాల్లో
## భాగంగా మెగా ఫైర్ సర్వీస్ డెమో

**ఆకట్టుకున్న మెగా ఫైర్ సర్వీస్ డెమో**

**అగ్నిమాపక వారోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి**

**అత్యాధునిక పరికరాలు , టెక్నాలజీని ఉపయోగిస్తున్నాం**

**ప్రాణాలు సైతం లెక్కచేయకుండా ఫైర్ సిబ్బంది విధులు నిర్వహణ**

**పరిశ్రమల్లో చిన్న చిన్న ప్రమాదాలు కూడా జరగకూడదు**

**ఫైర్ సేఫ్టీ ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలి :హోం మంత్రి అనిత**



విశాఖపట్నం, (ప్రశ్న న్యూస్)-జాతీయ అగ్నిమాపక వారోత్సవాలు సందర్భంగా విశాఖలోని ఆర్‌కే బీచ్ వద్ద అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫైర్ సర్వీసెస్ విభాగానికి చెందిన డైరెక్టర్ పి.వి. రమణ, డైరెక్టర్ (అడ్మిన్) మురళి పాల్గొన్నారు. కార్యక్రమంలో నిర్వహించిన మెగా ఫైర్ సర్వీస్ డెమో అతిథులు, నగరవాసులను విశేషంగా ఆకట్టుకుంది. అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ప్రాణాలు, ఆస్తులను రక్షించడంలో అగ్నిమాపక సిబ్బంది పోషించే కీలక పాత్రను అధికారులు వివరించారు. అలాగే వారోత్సవాల భాగంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను హోం మంత్రి అనిత పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఏప్రిల్ 14 నుండి 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అగ్ని ప్రమాదాల సమయంలో ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలను డెమోల ద్వారా వివరించామని చెప్పారు. 2018లో అగ్నిమాపక శాఖకు పరికరాలు కొనుగోలు చేశామని, 2019 నుంచి 2024 వరకు గత ప్రభుత్వం ఈ విభాగాన్ని పట్టించుకోలేదని ఆమె విమర్శించారు. తాజాగా రూ.232 కోట్లతో ఫైర్ వాహనాలను కొనుగోలు చేశామని, వాటిని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించారని వెల్లడించారు. ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ డ్రోన్లను కూడా ఉపయోగిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని, ఎక్కడైనా విపత్తు సంభవించినప్పుడు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అగ్నిమాపక సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారని ఆమె ప్రశంసించారు. హుద్‌హుద్ తుఫాను సమయంలో అలాగే విజయవాడలో బుడమేరు ఘటనలో కూడా ఫైర్ సిబ్బంది చేసిన సేవలను గుర్తు చేశారు. పరిశ్రమల్లో చిన్నపాటి ప్రమాదాలు కూడా జరగకూడదని, ఫైర్ సేఫ్టీ ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఫైర్ సిబ్బందికి అన్ని రంగాల్లో శిక్షణ అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమం ముగింపులో వివిధ విభాగాల్లో ఫైర్ సేఫ్టీ ప్రమాణాలు పాటించిన వారిని హోం మంత్రి సత్కరించారు. అనంతరం అగ్నిమాపక శాఖ అధికారులు హోం మంత్రి అనితను ఘనంగా సత్కరించారు.

## కోర్టు ఆదేశాలను ధిక్కరించిన
## అత్తాపూర్ ఆర్డీవోకు నెల రోజుల జైలు శిక్ష



హైదరాబాదు (ప్రశ్న న్యూస్) రంగారెడ్డి జిల్లా పెద్ద షాపూర్‌లో సర్వే నంబర్ 172-183 లలో 74 ఎకరాల సీలింగ్ ల్యాండ్ భూ వివాదంలో కోర్టు ఉత్తర్వులు అమలు చేయలేదని యూసుఫుద్దీన్ హైకోర్టులో పిటిషన్ వేశారు. విచారణ జరిపి, సూచించిన సమయానికి ఉత్తర్వులు జారీ చేయలేదని అత్తాపూర్ ఆర్డీవోకు కోర్టు ధిక్కరణ కింద నెల రోజుల జైలు, రూ. 2వేల జరిమానాను హైకోర్టు విధించిది. జరిమానా చెల్లించకుంటే 2వారాలు శిక్ష పొడిగించాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే అప్పిల్‌కు వీలుగా తీర్పు అమలును 2 వారాలు నిలిపివేత చేశారు.

# సాకేత్ భూసత్వలో

## ఉచిత ఫిజియోథెరపీ శిబిరానికి విశేష స్పందన



మేడ్చల్ ( ప్రశ్న న్యూస్ ) ఆరోగ్యకరమైన జీవితం ఫిజియోథెరపీతోనే సాధ్యమవుతుందని తెలంగాణ రాష్ట్ర సర్పంచుల ఫోరం మాజీ అధికార ప్రతినిధి, గౌడవల్లి, మాజీ సర్పంచ్ గరిసెల సురేందర్ ముదిరాజ్, సర్పంచ్ జన విజ్ఞాన వేదిక నాయకుడు ప్రసాదరావు అన్నారు. శనివారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని సాకేత్ భూసత్వ క్లబ్ హౌస్‌లో మొబిలిటీ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత ఫిజియోథెరపీ స్క్రీనింగ్ క్యాంప్ ను వారు ప్రారంభించి మాట్లాడుతూ వయసు పైబడటం వల్ల నడకలో సమతుల్యత కోల్పోయే వయోవృద్ధులకు ఇలాంటి శిబిరాలు ఎంతో అవసరమని, వారు ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ మెరుగైన జీవనం సాగించాలని కోరారు. క్యాంపు నిర్వాహకులు డాక్టర్ సమరాజ్ రెడ్డి, డాక్టర్ సౌమ్యశ్రీ మాట్లాడుతూ వికలాంగులు , వెనుకబడిన వర్గాలకు విద్య, ఆరోగ్య రంగాల్లో సమాన అవకాశాలు కల్పించి, వారి జీవన నాణ్యతను పెంచడమే తమ సంస్థ లక్ష్యమని వివరించారు. ఎముకలు, కండరాలు, కీళ్ల వ్యాధులు , నాడీ సంబంధిత సమస్యలతో బాధపడేవారు ఫిజియోథెరపీ ద్వారా ఉపశమనం పొందవచ్చని సూచించారు. ఈ శిబిరంలో సుమారు 50 మంది బాధితులకు పరీక్షలు నిర్వహించి, వారి సమస్యలకు అనుగుణంగా ఇంట్లోనే చేసుకోదగ్గ వ్యాయామాలపై ప్రాక్టికల్‌గా అవగాహన కల్పించారు. ఎండ తీవ్రత దృష్ట్యా శిబిరానికి వచ్చిన వారందరికీ భూసత్వ సొసైటీ ప్రతినిధులు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ డీఎస్పీ రామారావు, బీఎస్ఎన్ఎల్ విశ్రాంత ఇంజనీర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# కేసుల సత్వర పరిష్కారానికి మీడియేషన్ సెంటర్ ను ఉపయోగించుకోండి

## కృష్ణాజిల్లా ఇన్చార్జి జిల్లా జడ్జి గాజుల వెంకటేశ్వర్లు






మచిలీపట్నం (ప్రశ్న న్యూస్) రోజు రోజుకి పెరిగిపోతున్న కేసుల సత్వర పరిష్కారానికి మీడియేషన్ సెంటర్లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని కృష్ణాజిల్లా ఇన్చార్జి జిల్లా జడ్జి జిల్లా పోక్సోకోర్టు న్యాయమూర్తి గాజుల వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం కృష్ణా జిల్లా కోర్టు ప్రాంగణం లో న్యాయ సేవా సదనం లో న్యాయమూర్తులు న్యాయవాదులు మీడియేటర్స్ కక్షిధారులతో సంయుక్త సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గాజుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మీడియేషన్ ద్వారా కేసులు పరిష్కారానికి న్యాయవాదులు పూర్తి సహాయ సహకారాలు ఎంతో అవసరమని అన్నారు. మీడియేషన్ ద్వారా కేసులు పరిష్కరించుకుంటే ఉభయ పార్టీలకు సమయము, డబ్బు ఆదాఅవుతుందని, కోర్టులు పై ఒత్తిడి తగ్గుతుందని అన్నారు. మారుతున్న కాలానుగుణంగా మీడియేషన్ సెంటర్ యొక్క ప్రాముఖ్యత జాతీయ స్థాయిలో అంతర్జాతీయ స్థాయిలో పెరిగిందని అన్నారు. జిల్లా న్యాయసే వాధికారి సంస్థ కార్యదర్శి కే.రామకృష్ణయ్య మాట్లాడుతూ సుప్రీంకోర్టు హైకోర్టు దేశ స్థాయిలో మీడియేషన్ ద్వారా అత్యధిక కేసులు పరిష్కారం కోసం కృషి చేస్తున్నట్లు తెలియజేశారు.కృష్ణా జిల్లా వ్యాప్తంగా విజయవాడ తో సహా 98 మంది మీడియేటర్లు ప్రత్యేక శిక్షణ పొంది ఉన్నారని వారి ద్వారా గతంలో 2000 కేసులు పరిష్కారం చేసినట్లు తెలియజేశారు. కమర్షియల్ యాక్ట్ చట్ట ప్రకారం దాఖలు చేసే కేసులన్నీ కూడా ముందస్తుగా ప్రీ మీడియేషన్ కేసులుగా దాఖలు చేసుకోవాలని అన్నారు. న్యాయమూర్తులు న్యాయవాదులు సమన్వయంతో మీడియేషన్ ద్వారా కేసులు పరిష్కరించుకోవాలని అన్నారు. మచిలీపట్నం అదనపు సీనియర్ సివిల్ జడ్జ్ సి హెచ్. యుగంధర్, మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ, సీనియర్ న్యాయవాదులు గరిమేళ్ళ ప్రభాకర్ రావు, గంజి నాగేంద్రరావు మీడియేషన్ పై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో తొమ్మిదో అదనపు జిల్లా జడ్జి ఎస్.సుజాత బార్ అసోసియేషన్ కార్యదర్శి శయన సుధాకర్ న్యాయమూర్తులు న్యాయవాదులు పాల్గొన్నారు

# మేడ్చల్ లో కదం తొక్కిన బిజెపి శ్రేణులు

## మహిళా బిల్లులకు వ్యతిరేకంగా కాంగ్రెస్ తీర్మానం చేసిందని ఆరోపిస్తూ బిజెపి శ్రేణులు నిరసన



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) పార్లమెంటు లో మహిళా బిల్లు ను వ్యతిరేకంగా తీర్మానం చేసిన కాంగ్రెస్ పార్టీ వైఖరిని నిరసిస్తూ మేడ్చల్ పట్టణంలో బిజెపి శ్రేణులు కదం తొక్కారు . మేడ్చల్ పట్టణంలో మొదట నిరసన ర్యాలీ చేపట్టారు. మహిళా వ్యతిరేకి సీఎం రేవంత్ రెడ్డి, కాంగెస్ పార్టీ ..ఈ దేశంలో మహిళలను చట్టసభల్లో రానీయకుండా అడ్డు పడ్డందుకు మహిళలకు జరిగిన అన్యాయానికి నల్ల బ్యాడ్జీలు ధరించి మేడ్చల్ పట్టణంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎల్లంపేట మున్సిపాలిటీ వైస్ చైర్మన్ మేకల రజిత దేవేందర్ రెడ్డి, బిజెపి మేడ్చల్ అధ్యక్షురాలు జల్లి శైలజ హరినాథ్, ఎల్లంపేట కౌన్సిలర్ మహేశ్వరి,జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు గౌరవరం జగన్ గౌడ్, సముద్రాల హంస కృష్ణగౌడ్ కార్యదర్శి నరేందర్ రెడ్డి,జిల్లా కో ఆర్డినేటర్ లవంగ శ్రీకాంత్, జిల్లా నాయకులు కృష్ణ గౌడ్,ఎల్లంపేట మున్సిపాలిటీ అధ్యక్షులు శ్రీశైలం యాదవ్, మేడ్చల్ ప్రధాన కార్యదర్శి ప్రేమ్ దాస్, మహేష్ , నాయకులు వంశీధర్ రెడ్డి, మైసరి రాజు, చేరుకొమ్ము శ్రీనివాస్ గౌడ్, వాచుపల్లి శ్రీనివాస్ ,రాజేష్ ,రాజు నాయక్ మల్లేష్ యాదవ్ ,సత్యనారాయణ రెడ్డి ,పోచయ్య, పుష్ప మల్లారెడ్డి, అనిత, సాయి కుమార్ ,లక్ష్మణ్ ,రవి, చంద్రబాబు పెద్ద ఎత్తున నాయకులు మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ వైఖరిని పూర్తిగా ఖండించారు.

# వీఓఏలు ప్రభుత్వ లక్ష్యాలు సాధించాలి

## - ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

## - 37మంది వీఓఏలకు నూతన మొబైల్ ఫోన్ల పంపిణీ



చల్లపల్లి (ప్రశ్న న్యూస్ )వీఓఏలు ప్రభుత్వ లక్ష్యాలు సాధించాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సూచించారు. శనివారం చల్లపల్లిలోని వెలుగు కార్యాలయంలో మండలంలోని 37మంది వీఓఏలకు నూతన మొబైల్ ఫోన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ విచ్చేసి ఫోన్లు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల ద్వారా పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. డ్వాక్రా రుణాలతో పేదల జీవనోపాధి మార్గాలు మెరుగుపడేందుకు వీఓఏలు మార్గదర్శకులు కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఉచితంగా అందించిన మొబైల్ ఫోన్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, ఎంపీపీ కోట విజయ రాధిక, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, ఎంపీడీఓ ఏఏ ఆనందకుమారి, ఏపీఎస్ ఐడీసీ డైరెక్టర్ పైడిపాముల కృష్ణకుమారి, స్వచ్ఛ ఏపీ డైరెక్టర్ బోలెం నాగమణి, ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్, ఎంపీటీసీ పైడిపాముల స్వప్న, టీ.ఎన్.టీ.యూ.సీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రావి చంద్రశేఖర్ (చిట్టి), పంచాయతీ ఈఓ పీవీ మాధవేంద్రరావు, ఏపీఎం కారుమూరి శ్రీనివాసరావు, సీసీలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ధర్మాజీ గూడెం గ్రామంలో బడి పిలుస్తుంది

## ప్రారంభించిన: ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్



చింతలపూడి (ప్రశ్న న్యూస్) లింగపాలెం మండలం ధర్మాజీగూడెం గ్రామంలో నిర్వహించిన "బడి పిలుస్తుంది" కార్యక్రమంలో ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు, ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులను కలుసుకుని పిల్లలను పాఠశాలకు పంపాలని కోరారు. విద్య యొక్క ప్రాముఖ్యతను వివరించి, ప్రతి చిన్నారికి చదువు ఎంతో అవసరమని తెలియజేశారు.అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న సౌకర్యాలు, నాణ్యమైన విద్య, నాణ్యమైన యూనిఫామ్,మధ్యాహ్న భోజన పథకం తల్లికి వందనం పథకాలు వంటి అంశాలను వివరించారు,విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరవుతూ మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రజలు పాల్గొని విజయవంతం చేశారు.

# ప్రజ్ఞాపూర్ అంబేద్కర్ విగ్రహం వద్ద "దరువు జాతర"

## 25వ వార్షికోత్సవ వాల్ పోస్టర్ విడుదల



గజ్వేల్( ప్రశ్న న్యూస్) సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద "దరువు జాతర" పాటకు 25 సంవత్సరాలు పూర్తి కావొస్తున్న సందర్భంగా 25వ వార్షికోత్సవ వాల్ పోస్టర్‌ను ఘనంగా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ కళాకారుల బృందానికి చెందిన ఎల్లా సిద్దులు, ప్రవీణ్, సోమ్ నరేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాకారుల బృందం నాయకుడు సోమ్ నరేష్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమం కోసం ప్రారంభించిన "దరువు జాతర" పాటకు 25 సంవత్సరాలు పూర్తవుతున్నాయని తెలిపారు. ఈ నెల 25వ తేదీన రవీంద్ర భారతి లో ప్రత్యేక కళా ప్రదర్శన నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు సిరియాల్, లక్ష్మణ్, ప్రశాంత్, బీజేపీ 4వ వార్డు కౌన్సిలర్ రొట్టెల శ్రీనివాస్, సల్ల శ్రీనివాస్, కుమ్మరి రమేష్, గుండ్ర నర్సింలు, ఈది యాదగిరి, డాకని దత్తయ్య, రాజి లక్ష్మీ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# మహిళా బిల్లు వీగిపోవడం విచారకరం: బండి పద్మ

## మహిళలకు మేలు చేసే చట్టంపై ప్రతిపక్షాలది అనవసర రాద్ధాంతం

## దశాబ్ద కాలాల కల సాకారం అవుతున్న వేళ ప్రతిపక్షాల కపట బుద్ది తేటతెల్లమైంది

## మహిళలోకం ప్రతిపక్షాల కపట నీతిని, బుద్ధిని గమనించాలి




ఉప్పల్( ప్రశ్న న్యూస్) నారీ శక్తికి వందనం చేసే నారి శక్తి వందన్ అధినియం అద్భుత చట్టమని, దేశ చరిత్రలోనే మహిళలకు చారిత్రకంగా మిగిలిపోయే బిల్లుకు ప్రతిపక్షాలు అడ్డు తగలడం విచారకరమని, దశాబ్ద కాలాల కల కు ప్రతిపక్షాలు అడ్డుపడి మహిళలను తీవ్రంగా బాధించాయని ,మహిళా లోకం ప్రతిపక్షాల కపట బుద్ధిని గమనించాలని బిజెపి పార్టీ మహిళా మోర్చా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షురాలు బండి పద్మ అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నారీ శక్తి వందన్ తో చట్టసభల్లో మహిళలకు తగిన గుర్తింపు లభించకుండా ప్రతిపక్షాలు అడ్డుపడ్డాయన్నారు. ఆడబిడ్డలకు 33 శాతం రిజర్వేషన్లు మోడీ ప్రభుత్వం ఇస్తున్న బహుమానాన్ని ప్రతిపక్షాలు జీర్ణించుకోలేని స్థితికి తెచ్చాయన్నారు.దశాబ్ద కాలంగా మహిళా బిల్లు కార్యరూపం దాల్చలేకపోయిందని,నేడు మోడీ ప్రభుత్వ హయాంలో బిల్లును ఆమోదించడానికి 2023 లోనే తగిన ప్రక్రియను చేపట్టారని తెలిపారు. ప్రధానంగా 2023 లోక్ సభ,రాష్ట్ర శాసనసభల లో మహిళలకు 33 రిజర్వేషన్లు కల్పిస్తూ పార్లమెంట్ నారీ శక్తి వందన్ అధినియం ను ఆమోదించిన విషయాన్ని ఆమె ఈ సందర్భంగా గుర్తు చేశారు. నారీ శక్తి వందన్ పై ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతాలు, రాజకీయాలు చేయడం సరికాదన్నారు. మహిళల సంక్షేమం, అభివృద్ధి, రాజకీయ ప్రాధాన్యం పట్ల ప్రతిపక్షాలకు చిత్తశుద్ధి లేదనే విషయాన్ని తేట తెల్లం చేస్తుందన్నారు. కేంద్రంలో 2014 లో అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం మహిళల సంక్షేమం అభివృద్ధి కోసం కట్టుబడి పనిచేస్తుందన్నారు. దశాబ్ద కాలంగా పెండింగ్లో ఉన్న మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఎజెండాతో బిజెపికి ముందుకు వెళ్లిందన్నారు. ఆ దిశలోనే పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి చర్యలు తీసుకుంటే, బిల్లుకు అడ్డుపడి, 33 శాతం రిజర్వేషన్లు అమలుకాకుండా మహిళలకు తీవ్ర అన్యాయం చేశాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లును వ్యతిరేకించిన ప్రతిపక్షాలకు మహిళలు తగిన గుణపాఠం చెప్పాలని ఈ సందర్భంగా బండి పద్మ అన్నారు.

# యువత రాజకీయాల్లోకి రావాలి: కల్వకుంట్ల కవిత

## రాక్షస పాలన అంతం కావాలి

## ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలి

## ప్రజల అండగా ఎప్పుడు మేముంటాం




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హరిబోలి డివిజన్ యువ నాయకుడు సోను రాకేష్ గైక్వాడ్ ఆధ్వర్యంలో హరి బోలీ డివిజన్ నాయకులు కృష్ణ సాగర్ పోతరాజు తన అనుచరులతో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో కండువా కప్పుకుని జాగృతిలో చేరారు. ఈ సందర్భంగా రాకేష్ మాట్లాడుతూ యువత రాజకీయాల్లోకి రావాలని కవిత ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం దినదినాభివృద్ధి చెందుతుందని, ఈ సందర్భంగా ఈనెల 25వ తేదీన నూతన పార్టీ ఆవిష్కరణ సందర్భంగా గోడ పత్రికను విడుదల చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, దొంగ మాటలతో అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కారుకు ప్రజలు గట్టిగా బుద్ధి చెప్తారని ఈ సందర్భంగా రాకేష్ గైక్వాడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో రాజకుమార్,కళ్యాణ్, మల్లికార్జున,అరుస్,శ్రీకర్ రాజు,ఓంకార్,అనిల్, మాణిక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలు తీరాలంటే సిపిఐ పార్టీయే మార్గం :శివలింగ కృష్ణ




గజ్వేల్( ప్రశ్న న్యూస్) సిద్దిపేట జిల్లా గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన "ఇంటింటికి సిపిఐ" కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా పార్టీ నాయకులు గజ్వేల్ పట్టణంలోని పలు వీధుల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకున్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేస్తోన్న పార్టీ సిపిఐ మాత్రమేనని పేర్కొన్నారు. దాదాపు 100 సంవత్సరాల చరిత్ర కలిగిన సిపిఐ పార్టీ ఎల్లప్పుడూ పేదలు, కార్మికులు, సామాన్య ప్రజల పక్షాన నిలబడిందని తెలిపారు. ప్రజలు సిపిఐ పార్టీని ఆదరించి బలపరచాలని కోరారు.కార్యక్రమంలో భాగంగా సామాజిక నిధి సేకరణ చేపట్టారు. ప్రజలు ఇచ్చే ప్రతి రూపాయి ప్రజా సమస్యల పరిష్కారానికి, పోరాటాలకు వినియోగించబడుతుందని నాయకులు వివరించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యులు స్వర్గం రాజేశం, గజ్వేల్ నియోజకవర్గ కార్యదర్శి శివలింగ కృష్ణ, మండల సహాయ కార్యదర్శి మొట్ట శీను, నాయకులు వెంకటాచారి, నర్సింలు, బాలునర్సు తదితరులు పాల్గొన్నారు.




# ‘పోచమ్మ’ సిరీస్ రివ్యూ!

ఈ మధ్య కాలంలో గ్రామదేవతల నేపథ్యంలోని కథలకు క్రేజ్ పెరిగిపోయింది. గ్రామదేవతలకు సంబంధించిన కథలతో సినిమాలు .. సిరీస్ లు ఎక్కువగా ప్రేక్షకుల ముందుకు వస్తున్నాయి. అలా రూపొందిన వెబ్ సిరీస్ ‘పోచమ్మ’. హారర్ మిస్టరీ థ్రిల్లర్ జోనర్లో రూపొందిన ఈ సిరీస్ కి, రమేశ్ ఇందిర దర్శకత్వం వహించాడు. కన్నడలో నటుడిగా .. దర్శక రచయితగా ఆయనకి మంచి పేరు ఉంది. ఈ నెల 16వ తేదీ నుంచి ఈ సిరీస్, తెలుగు - తమిళ భాషల్లో ‘ఆహా’లో స్ట్రీమింగ్ అవుతోంది. అది అరకు ప్రాంతం. అక్కడ ఫ్రెడ్రిక్ (రమేశ్ ఇందిర) ఒక ఎస్టేట్ ను కొనుగోలు చేస్తాడు. భార్య నాన్సీ .. పెద్ద కూతురు ‘ఇవా’( ప్రియ శతమర్షన్) చిన్న కూతురు జెస్సీ (స్నేహల్ కామత్) ఇదే అతని కుటుంబం. ‘ఇవా’ భర్త డేవిడ్ (అర్జున్ అంబటి) కూడా వాళ్లతోనే ఉంటూ ఉంటాడు. అరకు ప్రాంతంలోని ఎస్టేట్ జెస్సీకి ఎంతగానో నచ్చుతుంది. అక్కడి వాతావరణాన్ని ఆమె ఎంతగానో ఇష్టపడుతుంది. ఆ ఎస్టేట్ వ్యవహారాలను రఘుపతి (అచ్యుత్ కుమార్) చూసుకుంటూ ఉంటాడు. రఘుపతి భార్య శాంతి .. కొడుకు సురేశ్ .. కూతురు గాయత్రి ఆ ఎస్టేట్ లోనే పనిచేస్తూ ఉంటారు. రఘుపతి ఎంతటి నిజాయితీ పరుడో, శాంతి అంతటి వంకర బుద్ధిని కలిగి ఉంటుంది. భర్త నిజాయితీ కారణంగా పేదవాళ్లుగా మిగిలిపోయామనే ఒక అసంతృప్తి ఆమెలో అసహనానికి కారణమవుతుంది. ఆ కారణంగానే ఆ ఎస్టేట్ లో ఆమె చిన్నచిన్న దొంగతనాలు చేస్తూ ఉంటుంది. భర్త ఎంతగా చెప్పినా ఆమె తన పద్ధతిని మాత్రం మార్చుకోదు. ఫ్రెడ్రిక్ ఫ్యామిలీ అక్కడికి వచ్చిన రోజు నుంచే, జెస్సీతో సురేశ్ చనువుగా ఉండటం మొదలుపెడతాడు. ఆమె కూడా అతనితో సన్నిహితంగా ఉంటుంది. ఫ్రెడ్రిక్ బంగ్లాకి ఎదురుగా .. ఆరుబయట ఓ చిన్న మందిరంలో ‘పోచమ్మ తల్లి’ విగ్రహం ఉంటుంది. అమ్మవారు అక్కడ ఇష్టపడి వెలిసిందని అంటారు. చుట్టుపక్కల వాళ్లంతా ఆ తల్లిని శక్తిమంతమైన దేవతగా కొలుస్తుంటారు. అయితే తన బంగ్లా ఎదురుగా ‘పోచమ్మ’ విగ్రహం ఉండటం ఫ్రెడ్రిక్ కి ఎంతమాత్రం నచ్చదు. రఘుపతి ఎంతగా చెబుతున్నా వినిపించుకోకుండా, ఆ విగ్రహాన్ని అక్కడి నుంచి తీసేయిస్తాడు. అతను ఇక పోచమ్మ శాపం నుంచి తప్పించుకోలేడని చుట్టుపక్కలవాళ్లు చెప్పుకుంటూ ఉంటారు. ఆ సమయంలోనే ‘రెడ్డి’ అనే వ్యక్తితో ఫ్రెడ్రిక్ కి వైరం ఏర్పడుతుంది. ఆ తరువాత కొన్ని రోజులకే జెస్సీ చనిపోతుంది. ఆమె మరణానికి కారకులు ఎవరు? ఆ మరణం చుట్టూ అల్లుకున్న రహస్యాలు ఏమిటి? జరుగుతున్న సంఘటనలకు కారణం పోచమ్మ శాపమేనా? అనేది కథ.ఎస్టేట్ ల నేపథ్యంలో గతంలో చాలానే కథలు వచ్చాయి. శ్రీమంతులు .. వాళ్లకి సంబంధించిన అనేక రహస్యాలకు నిలయాలుగా ఎస్టేట్ లు కనిపిస్తూ ఉంటాయి. అక్కడ ఏం జరుగుతుందనేది బయట ప్రపంచానికి తెలిసే అవకాశాలు తక్కువ. ఒకవేళ తెలిసినా నోరువిప్పే సాహసం ఎవరూ చేయరు. అలాంటి ఒక ఎస్టేట్ చుట్టూ ఈ కథ తిరుగుతూ ఉంటుంది.

సాధారణంగా ఎస్టేట్ కథలన్నీ కూడా ఆస్తులు .. వారసత్వాల చుట్టూ తిరుగుతూ ఉంటాయి. ఆస్తుల కోసం సాగే హత్యల చుట్టూ నడుస్తూ ఉంటాయి. అయితే ఈ కథ, ఎస్టేట్ లోని పోచమ్మతల్లిని కేంద్రంగా చేసుకుని కొనసాగుతుంది. పోచమ్మ విషయంలో అక్కడి ప్రజల విశ్వాసం .. వాళ్ల నమ్మకాలను ఎంతమాత్రం పట్టించుకోని ఫ్రెడ్రిక్ అహంభావం ఈ కథలో కీలకమైన అంశాలుగా కనిపిస్తాయి. దర్శకుడు ఈ కథలో నాలుగు ప్రధానమైన పాత్రలను తీసుకున్నాడు. చనిపోయిన జెస్సీ పాత్ర చుట్టూ, అనుమానించదగినవిగా కొన్ని పాత్రలు కనిపిస్తాయి. ఆ జాబితాలో ఫెడరిక్ శత్రువు రెడ్డి .. అల్లుడు డేవిడ్ .. ఎస్టేట్ మేనేజర్ కొడుకు సురేశ్ ఉంటారు. ఈ పాత్రల పట్ల సందేహాలను రేకెత్తిస్తూ దర్శకుడు కథను మలుపులు తిప్పుతూ వెళ్లిన తీరు ఆకట్టుకుంటుంది. జెస్సీ మరణానికి కారణం ప్రేమనా? ప్రతీకారమా? స్వార్థమా? మోహమా? పోచమ్మ శాపమా? అనే అంశాలు ఆసక్తిని రేకెత్తిస్తూ వెళతాయి. ఈ సిరీస్ టైటిల్ ‘పోచమ్మ’. కథకి కేంద్రస్థానం పోచమ్మనే. అయితే ఆ పోచమ్మకి సంబంధించిన సన్నివేశాలను బలంగా అల్లుకోలేదని అనిపిస్తుంది. అమ్మవారు అక్కడ వెలిసిందనీ .. మహాశక్తిమంతమైనదని చెబుతారు. అయితే అమ్మవారి పట్ల స్థానికులకుగల బలమైన విశ్వాసాన్ని చూపించలేదు. ఆ తల్లితో వాళ్లకి గల సెంటిమెంట్ ను ఆవిష్కరించే ప్రయత్నం చేయలేదు. నిజానికి అమ్మవారి పట్ల ఆ స్థాయి విశ్వాసం ఉన్నప్పుడు, స్థానికులు ఆ విగ్రహాన్ని పెకిలించే సాహసం చేయరు. కానీ ఇక్కడ రఘుపతి చెబుతున్నా పనివాళ్లు వినిపించుకోరు. ఇక విగ్రహం పెకిలిస్తున్నా .. దూరంగా విసిరి పారేస్తున్నా ఎలాంటి ఎఫెక్టులు పడలేదు. ఇక జెస్సీ తాగేసి పెంకులతో కూడిన పైకప్పు పైకి ఎక్కడం హాస్యాస్పదంగా అనిపిస్తుంది. ఆమె తాగేసి ఇల్లెక్కుతే, ‘అక్కడికి ఎందుకు వెళ్లావ్’ అని క్రింది నుంచి తల్లిదండ్రులు అడగడం మరీ విడ్డూరం. దర్శకుడైన రమేశ్ ఇందిర ఈ సిరీస్ లో ప్రధానమైన పాత్రను పోషించాడు. పోచమ్మ విగ్రహాన్ని తొలగించి ఆ తల్లి ఆగ్రహానికి గురికావడమనే ఇంట్రెస్టింగ్ లైన్ ను ఆయన బాగానే సిద్ధం చేసుకున్నాడు. అయితే పోచమ్మతో పాటు ప్రధానమైన పాత్రలకి సంబంధించి సరైన కసరత్తు జరగలేదని అనిపిస్తుంది. అందువల్లనే ఆ పాత్రలు అంత పవర్ఫుల్ గా కనిపించవు. ఉత్కంఠను కలిగించే సన్నివేశాలు తేలికగా తెలిపోతూ ఉంటాయి. కథ పోచమ్మను వదిలేసి అటూ ఇటూ పరిగెడుతూ ఉండటం అసహనాన్ని కలిగిస్తుంది.

అచ్యుత్ కుమార్ .. రమేశ్ ఇందిర మంచి ఆర్టిస్టులు. అయితే వాళ్ల స్థాయిలో పాత్రలను డిజైన్ చేయలేదనే అనిపిస్తుంది. శ్రీ షా ఫొటోగ్రఫీ బాగుంది. ఎస్టేట్ నేపథ్యంలోని లొకేషన్స్ ను ఆవిష్కరించిన తీరు మెప్పిస్తుంది. ముత్తు గణేశ్ అందించిన నేపథ్య సంగీతం, కుతూహలంతో కథను ఫాలో అయ్యేలా చేస్తుంది. ‘పోచమ్మ’ అనే టైటిల్ ఆసక్తిని రేకెత్తిస్తుంది. ఎంచుకున్న లైన్ కూడా ఫరవాలేదు. కాకపోతే ప్రెజెంటేషన్ ఆశించిన స్థాయిలో లేదనిపిస్తుంది. రొటీన్ కి భిన్నంగా అనిపించే సన్నివేశాలను .. ఆడియన్స్ ఊహకి అందని క్లైమాక్స్ ను ప్లాన్ చేస్తూ, కంటెంట్ విషయంలో ఇంకాస్త కేర్ తీసుకుని ఉంటే బాగుండేదని అనిపిస్తుంది

## నెగెటివ్ క్యారెక్టర్‌లో నటించడంపై రాశి స్పందన



ఒకప్పుడు తెలుగు తెరపై వెలిగిపోయిన హీరోయిన్ రాశి, ప్రస్తుతం క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా సెకండ్ ఇన్నింగ్స్‌లో బిజీగా ఉన్నారు. తిరువీర్ హీరోగా నటించిన ‘పాపం ప్రతాప్’ సినిమా విడుదలై మంచి ఆదరణ పొందుతున్న తరుణంలో, ఈ చిత్ర సక్సెస్ మీట్‌లో రాశి తన సినీ ప్రస్థానంపై కీలక వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా మహేశ్ బాబు హీరోగా వచ్చిన ‘నిజం’ సినిమాలో తాను చేసిన నెగెటివ్ షేడ్ ఉన్న పాత్ర గురించి ప్రస్తావిస్తూ.. “ఆ రోల్ అంత నెగెటివ్‌గా మారుతుందని నేను అస్సలు ఊహించలేదు” అని పేర్కొన్నారు.

కేవలం ఒక నటిగా అన్ని రకాల షేడ్స్ చేయాలనే ఉద్దేశంతోనే ఆ సినిమాలో నటించానని చెప్పారు. ఇకపై తాను చేసే పాత్రల విషయంలో చాలా స్పష్టంగా ఉంటానని రాశి తెలిపారు. “‘పాపం ప్రతాప్’ దర్శకుడు నా కోసమే ఈ పాత్ర రాశానని చెప్పారు. పాత్రలో దమ్ముండి, అది ప్రేక్షకులకు నచ్చుతుంది అనుకుంటేనే గ్రీన్ సిగ్నల్ ఇస్తాను. అది పాజిటివా, నెగెటివా అన్నది నాకు ముఖ్యం కాదు” అని ఆమె వివరించారు. గోపీచంద్ విలన్‌గా మెరిసిన ‘నిజం’లో రాశి చేసిన బోల్డ్, నెగెటివ్ పాత్ర అప్పట్లో పెద్ద సంచలనమే సృష్టించింది. మళ్ళీ ఇన్నేళ్ల తర్వాత ఆమె ఒక మంచి హిట్ మూవీతో ప్రేక్షకులను పలకరించడం విశేషం.

## జెట్లీ ఆగమనం అప్పుడే



కమెడియన్ సత్య కథానాయకుడిగా రితేష్ రానా దర్శకత్వంలో రూపొందుతున్న కామెడీ యాక్షన్ థ్రిల్లర్ ‘జెట్లీ’. రియా సింఘా కథానాయిక. వెన్నెల కిశోర్ కీలక పాత్రధారి. చిరంజీవి(చెర్రీ), హేమలత పెద్దామల్లు నిర్మాతలు. మైత్రీ మూవీ మేకర్స్ సినిమాను విడుదల చేస్తున్నది. శుక్రవారం ఈ సినిమా రిలీజ్ డేట్‌ని అధికారికంగా ప్రకటించారు. మే 1న ప్రపంచవ్యాప్తంగా ‘జెట్లీ’ విడుదల కానున్నది. ఈ సందర్భంగా విడుదల చేసిన రిలీజ్ డేట్ పోస్టర్‌లో డైనమిక్‌గా నడుస్తూ వస్తున్న సత్య, వెన్నెల కిశోర్‌లను చూడొచ్చు. ఈ చిత్రానికి కెమెరా: సురేశ్ సారంగం, సంగీతం: కాలభైరవ, నిర్మాణం: క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్.

## ముగ్గురు భామల మధ్య ఆయుష్మాన్..



బాలీవుడ్ విలక్షణ నటుడు ఆయుష్మాన్ ఖురానా కథానాయకుడిగా రూపొందుతున్న ‘పతి పత్ని ఔర్ వో డో’ చిత్రానికి సంబంధించిన క్రేజీ అప్‌డేట్ వచ్చేసింది. శనివారం మేకర్స్ ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేయడంతో పాటు, విడుదల తేదీని కూడా అధికారికంగా ప్రకటించారు. 2019లో కార్తీక్ ఆర్యన్ హీరోగా వచ్చి సూపర్ హిట్ సాధించిన ‘పతి పత్ని ఔర్ వో’ చిత్రానికి ఇది సీక్వెల్‌గా రాబోతుంది. తాజాగా విడుదలైన పోస్టర్‌లో ఆయుష్మాన్ ఖురానా ‘ప్రజాపతి పాండే’ అనే పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించబోతున్నాడు. ఖాకీ యూనిఫాంలో ఉన్న ఆయన, ఒక బంగారు రంగు నెట్‌లో చిక్కుకుని భయంతో ఉండగా, పక్కనే ఒక పెద్ద చిరుతపులి ప్రశాంతంగా కూర్చుని ఉండటం పోస్టర్‌పై ఆసక్తిని రేకెత్తిస్తోంది. “శికారీ ఖుద్ హోగయా శికార్! (వేటగాడే స్వయంగా వేటగా మారాడు) అంటూ ఆయుష్మాన్ ఈ పోస్టర్‌ను సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు. ముదస్సర్ అజీజ్ దర్శకత్వం వహిస్తున్న ఈ క్రేజీ ప్రాజెక్టులో ఆయుష్మాన్ సరసన సారా అలీ ఖాన్, రకుల్ ప్రీత్ సింగ్, వామికా గబ్బి ముగ్గురు కథానాయికలుగా నటిస్తున్నారు. వీరి ముగ్గురి వలన ప్రజాపతి పాండే జీవితం ఎలాంటి గందరగోళంలో పడింది అనే అంశంపై ఈ చిత్రం ఉండబోతోంది. టీ-సిరీస్ మరియు బి.ఆర్. స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ భారీ కామెడీ ఎంటర్‌టైనర్ వచ్చే ఏడాది మే 15, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. గతంలో వచ్చిన మొదటి భాగం బాక్సాఫీస్ వద్ద ఘనవిజయం సాధించిన నేపథ్యంలో, ఇప్పుడు ఆయుష్మాన్ తన మార్క్ కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకులను ఏ మేరకు మెప్పిస్తారో అని బాలీవుడ్ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.

## జ్ఞాపకాలు గుర్తుచేసుకుంటున్నారు



‘సినిమాకు వస్తున్న స్పందన చూస్తుంటే ఆనందంగా ఉంది. మేం పదే పదే రిక్వెస్ట్ చేస్తున్నాం. కుటుంబసమేతంగా సినిమాకు వెళ్లండి. అందరికీ నచ్చుతుంది. సెకండాఫ్,క్లైమాక్స్ బావుందని అందరూ అంటున్నారు. కొత్తవాళ్లతో సినిమా చేశాం. ఆదరిస్తారని ఆశిస్తున్నాం’ అని చిత్రనిర్మాత కిరణ్ అబ్బవరం అన్నారు. కొత్త తారలైన సాయితేజ్, వేద జలంధర్, ప్రదీప్ కొట్టె, స్వాతి కరిమిరెడ్డి, అమ్మ రమేశ్, సత్యనారాయణ, లతీశ్ ముఖ్య పాత్రలు పోషించిన పీరియడ్ కామెడీ ఎంటర్‌టైనర్ ‘తిమ్మరాజుపల్లి టీవీ’. వి.మునిరాజు దర్శకుడు. శుక్రవారం సినిమా విడుదలైంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సక్సెస్ మీట్‌లో కిరణ్ అబ్బవరం మాట్లాడారు. సినిమా చూసినవారంతా తమ జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటున్నారని, ఈ సంతోషం కోసమే రెండున్నరేళ్లు కష్టపడ్డామని దర్శకుడు మునిరాజు చెప్పారు. ఇంకా హీరోహీరోయిన్లు సాయితేజ్, వేద జలంధర్‌తో పాటు చిత్రబృందమంతా మాట్లాడారు.

## దీపిక సరికొత్త వ్యూహం

బాలీవుడ్ అగ్రతార దీపిక పదుకోణ్ తన కెరీర్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. ఇకనుంచి యంగ్ హీరోలతో స్క్రీన్ షేర్ చేసుకోవడం ద్వారా తన ఇమేజ్‌ని రీ డిజైన్ చేసుకోవాలనే ప్రయత్నంలో ఉన్నది ఈ అందాలభామ. కొత్త ఆడియన్స్‌ని ఆకర్షించేందుకే దీపికా ఈ స్ట్రాటజీని ఫాలో అవుతున్నదని బాలీవుడ్ మీడియా కోడై కూస్తున్నది. ఇందులో భాగంగా ఆమె బడ్జెట్ గురించి, బ్యానర్ గురించి ఆలోచించకుండా కేవలం పాత్రలకే ప్రాధాన్యతనిస్తూ కథలు వింటున్నదట. మరోవైపు మహిళా ప్రాధాన్యత ఉన్న పాత్రల వైపు కూడా దీపిక మొగ్గు చూపుతున్నదని బీటౌన్ టాక్. అలాగే.. తన భర్త రణ్‌వీర్‌సింగ్ నటిస్తూ నిర్మిస్తున్న జాంబి యాక్షన్ థ్రిల్లర్ ‘ప్రళయ్’ చిత్రంలో నటించేందుకు కూడా దీపిక ఆసక్తి చూపిస్తున్నదట. సొంత సినిమా కావడంతో పారితోషికం కూడా వద్దనుకుందట. కొత్త జానర్స్‌పై ఆసక్తి చూపడంలో భాగమే ఇదంతా అని ఆ చిత్ర మేకర్స్ అంటున్నారు. మొత్తంగా ఓవర్ స్కిన్‌షోకు దూరంగా, క్వాలిటీకి దగ్గరగా ఉండాలని దీపిక ఫిక్సయినట్లు తెలిసింది.



## జనవరిలో లవ్ అండ్ వార్



అగ్ర దర్శకుడు సంజయ్‌లీలా భన్సాలీ రూపొందిస్తున్న ‘లవ్ అండ్ వార్’ సినిమా రిలీజ్ డేట్ విషయంలో గత కొంతకాలంగా సందిగ్ధత నెలకొంది. ఇప్పటికే మూడుసార్లు ఈ సినిమా విడుదల వాయిదా పడింది. ఈ నేపథ్యంలో శుక్రవారం కొత్త రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. వచ్చే ఏడాది జనవరి 21న ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకుతీసుకొస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. రణ్‌బీర్‌కపూర్, అలియాభట్, విక్కీ కౌశల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాపై నిర్మాణ దశ నుంచే అంచనాలు ఏర్పడ్డాయి. ఇందులో రణ్‌బీర్‌కపూర్, విక్కీకౌశల్ ఎయిర్‌ఫోర్స్ ఆఫీసర్లుగా కనిపించనున్నారు. యుద్ధ నేపథ్య ముక్కోణపు ప్రేమకథగా తనదైన శైలి తీవ్ర భావోద్వేగాలు, సంఘర్షణ కలబోసి దర్శకుడు సంజయ్‌లీలా భన్సాలీ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు.

# తేజస్వి సూర్య వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత మైలారం రాం ఫైర్

**- తెలంగాణ అస్థిత్వాన్ని అవమానిస్తే సహించం**

**- వేములవాడ కాంగ్రెస్ పార్టీ నేత,రాష్ట్ర రజక సంఘం మాజీ కన్వీనర్ : మైలారం రాము**



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ పార్లమెంట్ వేదికగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలను రాజన్న సిరిసిల్ల జిల్లా,తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం జిల్లాధ్యక్షులు బత్తిని మహేందర్ యాదవ్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ సాధన కోసం కోట్లాది ప్రజలు చేసిన త్యాగాలను కించపరచే విధంగా మాట్లాడటం బీజేపీ అహంకారానికి నిదర్శనమని ఆయన మండిపడ్డారు. తెలంగాణ నుంచి బీజేపీకి ఎనిమిది మంది ఎంపీలు గెలిచినా, అందులో ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నప్పటికీ రాష్ట్ర గౌరవాన్ని కాపాడడంలో విఫలమయ్యారని విమర్శించారు. సొంత రాష్ట్రంపై అవమానకర వ్యాఖ్యలు వస్తున్నా స్పందించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నుంచి తేజస్వి సూర్య వరకు బీజేపీ నాయకత్వం తెలంగాణపై వివక్ష చూపుతోందని ఆరోపించారు. రాష్ట్ర విభజన హామీలను అమలు చేయకపోవడమే కాకుండా, ఇప్పుడు రాష్ట్ర ఏర్పాటునే అవమానించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. అవగాహన లేకుండా అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన తేజస్వి సూర్యను వెంటనే పదవి నుంచి తొలగించాలని మహేందర్ యాదవ్ డిమాండ్ చేశారు. ఇకపై తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఎవరైనా మాట్లాడితే రాష్ట్ర ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

# ఉద్యమ కళాకారుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలి

**- కళాకారుల హక్కుల కోసం మరో పోరాటానికి సిద్ధం**

**- ఉద్యమ కళాకారుల సదస్సులో వారాల దేవయ్య గళమెత్తిన స్వరం**



వేములవాడ (ప్రశ్న న్యూస్ హైదరాబాద్,శనివారం మర్రి కృష్ణారెడ్డి ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన రాష్ట్ర ఉద్యమ కళాకారుల సదస్సులో రాజన్న సిరిసిల్ల జిల్లా ఉద్యమ కళాకారుల అధ్యక్షుడు వారాల దేవయ్య ప్రధాన ఆకర్షణగా నిలిచారు.సదస్సులో మాట్లాడిన వారాల దేవయ్య తన గళాన్ని బలంగా వినిపించారు. తెలంగాణ కోసం ఎన్నో సంవత్సరాలు పేదలు, కళాకారులు ప్రాణాలను పణంగా పెట్టి పోరాటం చేశారని గుర్తుచేశారు. తాను 1969 తొలి దశ ఉద్యమంలో పాల్గొన్నానని వెల్లడిస్తూ, ప్రస్తుతం 67 ఏళ్ల వయస్సులో కూడా ఉద్యమ ఆవేదన తగ్గలేదని అన్నారు.ఉద్యమ కళాకారుల సమస్యలు ఇంకా పరిష్కారం కాకపోవడం బాధాకరమని పేర్కొన్న ఆయన, ఇకపై వేచి చూసే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యమ కళాకారుల న్యాయమైన కోరికలు తీర్చాలని డిమాండ్ చేశారు.వారాల దేవయ్య ప్రసంగం సభలో పాల్గొన్న కళాకారుల్లో ఉత్తేజాన్ని నింపింది. ఆయన మాటలు ఉద్యమ స్ఫూర్తిని మళ్లీ రగిలించగా, కళాకారుల హక్కుల కోసం పోరాటం కొనసాగించాలనే సంకల్పాన్ని మరింత బలపరిచాయి. సదస్సు ముగింపులో వారాల దేవయ్య పాల్గొన్న అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

# మహిళా హక్కులపై కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి

**- మహిళా బిల్లుపై కాంగ్రెస్ వైఖరికి నిరసనగా బీజేపీ ఆందోళన**

**- భాజపా మండలాధ్యక్షులు : ఎడపల్లి పరిశురాం**



వేములవాడ (ప్రశ్న న్యూస్) మహిళా రిజర్వేషన్ బిల్లును కాంగ్రెస్ పార్టీ అడ్డుకుంటోందని ఆరోపిస్తూ భారతీయ జనతా పార్టీ (బీజేపీ) బోయినిపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షులు ఎడపల్లి పరశురాం మాట్లాడుతూ, మహిళా సాధికారతపై మాట్లాడే కాంగ్రెస్ పార్టీ అసలు వైఖరి బయటపడిందన్నారు. మహిళల హక్కులకు మద్దతు ఇవ్వాల్సిన సమయంలో రాజకీయ ప్రయోజనాల కోసం బిల్లును అడ్డుకోవడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు.మహిళా శక్తి వందన అధినియం బిల్లుపై కాంగ్రెస్ మరియు 'ఇండియా' కూటమి చూపుతున్న వైఖరి మహిళా వ్యతిరేకతకు నిదర్శనమని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రతిపక్షాల ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చినా, బిల్లును ఆమోదం పొందకుండా అడ్డుకోవడం వారి ద్వంద్వ వైఖరిని చూపిస్తోందన్నారు. గతంలో ఎన్నో సంవత్సరాలు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేయడంలో విఫలమైందని, ఇప్పుడు కూడా అదే ధోరణిని కొనసాగిస్తోందని విమర్శించారు. మహిళల అభివృద్ధికి కట్టుబడి ఉన్న మోదీ ప్రభుత్వానికి మద్దతు ఇవ్వకుండా అడ్డంకులు సృష్టించడం రాజకీయ లబ్ధి కోసమేనని ఆరోపించారు.రాబోయే ఎన్నికల్లో మహిళా శక్తిని తక్కువ అంచనా వేసే కాంగ్రెస్ కూటమికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉదారి నరసింహ చారి, మాజీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్ రెడ్డి, కొండమ్ శ్రీనివాస్ రెడ్డి, సుంకపాక ప్రభు, బోగోజి గంగాధర్ చారి, మినుకుల శ్రీనివాస్, సారంపల్లి రాజు, పెంచాల మహేష్, కొనుకటి హరీశ్, ముసుకు విజయేందర్ రెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించిన డిఆర్డిఏ పిడి సాయన్న

ధర్పల్లి (ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలం లో అన్ని గ్రామాలలో డిఆర్డిఏ పిడి సాయన్న ధర్పల్లి ఎంపీడీవో లక్ష్మారెడ్డి సిరికొండ ఎంపీడీవో మనోహర్ రెడ్డి లతో ఉపాధి హామీ పథకాన్ని, నర్సరీలను, తాగునీటి సమస్య, వరి కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. రైతులకు ఇబ్బంది కలగకుండా కొనుగోలు కేంద్రాలను వేగవంతం చేశామని అన్నారు.ఉపాధి హామీ కూలీలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. ఉపాధి హామీ పనిచేసే దగ్గర పేస్ రికగ్నిషన్ రాకుంటే సిగ్నల్ వచ్చే దగ్గరకు వెళ్లి అక్కడ ఫోటో తీసుకొని పని ప్రారంభించాలని పని ముగించిన తర్వాత నెట్వర్క్ వచ్చిన ప్లేస్ కి వచ్చి కూలీలకు హాజరు వేయాలనీ సూచించారు. ఉపాధి పనులు ఊపందుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు టార్గెట్ ను పూర్తి చేయాలని గట్టిగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో



ధర్పల్లి ఎంపీడీవో లక్ష్మారెడ్డి, సిరికొండ ఎంపీడీవో మనోహర్ రెడ్డి,



అన్ని గ్రామాల సెక్రెటరీలు, టి ఏ లు ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డుపై డ్రైనేజీ నీరు.. ఆందోళనకు దిగిన ఆటో డ్రైవర్లు

**- ముద్దు నిద్రలో జిహెచ్ఎంసి అధికారులు - ఉన్నారంటూ ఆటో డ్రైవర్ల ఆరోపణ**

మేడ్చల్ (ప్రశ్న న్యూస్) మేడ్చల్ బస్ డిపో వద్ద రోడ్డుపై డ్రైనేజీ నీరు ఏరులై పారుతుండడంతో ఆటో యూనియన్ నేతలు ఆందోళనకు దిగారు. రోడ్డుపై పాలుతున్న డ్రైనేజీ నీటీని చూపిస్తూ ఆందోళనకు దిగారు. జిహెచ్ఎంసి అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జిహెచ్ఎంసి హయాంలో అభివృద్ధి కుంటుపడుతుందని రోడ్డుపై మురికి నీరు ఈ ఏరులై పారుతున్న పట్టించుకునే నాధుడే కరువయ్యారని ఆటో యూనియన్ నేతలు ఆరోపించారు. రోజుల తరబడి మురికి నీరు రోడ్డుపై పారుతుండడం వల్ల దుర్వాసన దోమలు వ్యాప్తి చెందుతున్నాయని ఆరోపించారు. మురికి నీరు పారుతున్న ప్రదేశంలోనే ఆటో స్టాండ్ ఉండడం వల్ల ఆటో ఎక్కేందుకు ప్రజలు ఎవరు రావడంలేదని తెలిపారు. జిహెచ్ఎంసి అధికారులు ఇప్పటికైనా స్పందించి రోడ్డుపై పారుతున్న డ్రైనేజీ



నీటి సమస్యను మరమ్మత్తులు చేసి పరిష్కరించాలని ఆటో యూనియన్ నేతల కోరారు ఈ కార్యక్రమంలో ఐ ఎన్ టి యు సి ఆటో యూనియన్ నేత ఎర్ర విజయ రావు చంద్రశేఖర్



కుమార్ శ్రీనివాస్ మల్లేష్ జి శ్రీనివాస్ నరసింహ కే శ్రీనివాస్ నరసింహ పి నరసింహ సతీష్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# నేలకొరిగిన బహుజన విప్లవ కెరటం - కన్నం రఘున్నకు నివాళులు

**- బీఎస్పీ మండల శాఖ**




బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, రాళ్ల రామన్నపేటకు చెందిన మాజీ సర్పంచ్, బహుజన్ సమాజ్ పార్టీ తొలి తరం నాయకుడు కన్నం రఘున్న మరణం బహుజన సమాజానికి తీరని లోటుగా నిలిచింది.బహుజన్ ఉద్యమ పితామహుడు కాన్షిరాం స్ఫూర్తితో రాజకీయాల్లోకి అడుగుపెట్టిన రఘున్న, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బిఎస్పీ బలపరిచేందుకు కీలక పాత్ర పోషించారు. 1989లో పార్టీని రాష్ట్రానికి తీసుకువచ్చి, అనేక మంది బహుజన ఉద్యమ కారులను తయారు చేసిన నాయకుడిగా గుర్తింపు పొందారు.రాళ్ల రామన్నపేట గ్రామ సర్పంచ్‌గా సేవలందించిన ఆయన, సామాజిక న్యాయం కోసం ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేశారు. బహుజన ఉద్యమాలకు కర్త, కర్మ, క్రియగా నిలిచి అనేక మంది నాయకులను తీర్చిదిద్దారు.కన్నం రఘున్న మరణం బహుజన సమాజానికి తీవ్రమైన లోటని పార్టీ నేతలు, కార్యకర్తలు పేర్కొన్నారు.రఘున్న అంత్యక్రియలు నేడు ఆదివారం ఉదయం రాళ్ల రామన్నపేటలో నిర్వహించబడనున్నాయి. బహుజన ఉద్యమ కారులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై నివాళులు అర్పించాలని బహుజన్ సమాజ్ పార్టీ బోయినిపల్లి మండల శాఖ పిలుపునిచ్చింది.

# కలెక్టర్ ని కలిసిన జర్నలిస్ట్ వెల్ఫేర్ యూనియన్



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ని కలిసి ధన్యవాదాలు తెలిపిన ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ వెల్ఫేర్ యూనియన్ ఇటీవల జరిగిన అక్రిడేషన్ కమిటీ మీటింగ్లో అర్హత కలిగిన జర్నలిస్ట్ లు అందరికి జిఓ ప్రకారం న్యాయం చేకూర్చిన తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ని ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ వెల్ఫేర్ యూనియన్ రాష్ట్ర కమిటీ మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలియజేశారు.అనంతరం రాష్ట్ర అధ్యక్షులు బూసి మునిబాబుతో కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని అర్హత కలిగిన జర్నలిస్ట్ లు అందరికి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ వెల్ఫేర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బూసి మునిబాబు, కార్యదర్శి యస్.దీనదయాళ్ వైస్ ప్రెసిడెంట్ రాము గౌరవ అధ్యక్షులు రాజశేఖర్, రాష్ట్ర కమిటీ సభ్యులు ప్రభుదాస్, శివయ్యలు పాల్గొన్నారు.

# మున్సిపల్ కో-ఆప్షన్ పదవికి ఆర్కే శ్రీనివాస్ ముమ్మర ప్రయత్నాలు



గజ్వేల్( ప్రశ్నా న్యూస్ )సిద్దిపేట జిల్లా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో కో-ఆప్షన్ సభ్య పదవికి మాజీ కౌన్సిలర్, కొండపోచమ్మ దేవస్థానం మాజీ డైరెక్టర్ ఆర్కే శ్రీనివాస్ ముమ్మర ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు.శనివారం గజ్వేల్‌లో ఆర్కే శ్రీనివాస్ మాట్లాడుతూ, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యునిగా అవకాశం కల్పిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో వార్డ్ మెంబర్‌గా, కౌన్సిలర్‌గా పనిచేసిన అనుభవం తనకు ఉందని తెలిపారు.బీఆర్ఎస్ పార్టీ కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తూ, పార్టీ అభివృద్ధికి నిరంతరం పని చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజల మధ్యే ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నామని అన్నారు. బీఆర్ఎస్ అధిష్టానం తనకు మద్దతు ఇస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.కో-ఆప్షన్ పదవి లభిస్తే గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆర్కే శ్రీనివాస్ తెలిపారు.

# స్థానికుల నిర్ణయానికే ప్రధమ ప్రాధాన్యత

**ఎస్టిపిని తరలిస్తాం లేదా రద్దు**

**ముఖ్యమంత్రితో సైతం చర్చిస్తాము**

**ఎస్టిపి ప్లాంట్ ఏర్పాటు పై ఎమ్మెల్యే జిఎంఆర్**



పటాన్‌చెరు(ప్రశ్న న్యూస్ ) ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా అమీన్పూర్ లో ఏర్పాటు చేయదలచిన సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంటును తరలించడం లేదా రద్దు చేయడం జరుగుతుందని.. ప్రజలు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. శనివారం ఉదయం అమీన్పూర్ డివిజన్ పరిధిలోని 993 సర్వే నంబర్లో ఎస్ టి పి ఏర్పాటు చేయనున్న స్థలంలో శనివారం ఆయా కాలనీల ప్రజలతో ఎమ్మెల్యే జిఎంఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న అమీన్పూర్ పరిధిలోని మురుగు నీటి జలాలను శుద్ధి చేయాలన్న లక్ష్యంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో ఎస్టిపి ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఈ ప్లాంట్ ఏర్పాటు ద్వారా తమకు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని స్థానిక కాలనీల ప్రజల నుండి పెద్ద ఎత్తున అభ్యంతరాలు తలెత్తుతున్న నేపథ్యంలో.. మెజార్టీ ప్రజలు, స్థానిక మాజీ ప్రజాప్రతినిధుల అభిప్రాయానికి అనుగుణంగా ఎస్టిపిని తరలించడం లేదా రద్దు చేసేందుకు ప్రభుత్వంతో చర్చించనున్నట్లు తెలిపారు. అవసరమైన పక్షంలో ముఖ్యమంత్రి దృష్టికి సైతం తీసుకుని వెళ్లడం జరుగుతుందని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అమీన్పూర్ లో ఎస్టీపీని ఏర్పాటు చేయడం జరగదని స్పష్టం చేశారు. అత్యంత అవసరమైతే ప్రత్యేక పైపులైను ఏర్పాటు చేసి నక్కవాగులోకి తరలించడం జరుగుతుందని తెలిపారు. పనులను వెంటనే నిలిపివేయాలని సంబంధిత అధికారులను, కాంట్రాక్టర్ ను ఆదేశించారు. ప్లాంట్ ఏర్పాటుపై రాజకీయాలు చేయడం మానుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అమీన్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, అమీన్పూర్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, జలమండలి సిజిఎం పద్మజ, జిఎం సుబ్బారాయుడు, మాజీ ప్రజా ప్రతినిధులు, ఆయా కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

# మేడ్చల్ కు ప్రత్యేక రిజర్వాయర్ ఏర్పాటు చేయాలి

**హెచ్ఎం డబ్ల్యూ ఎస్ ఎస్ బి ఎండికి**

**వినతి పత్రం అందజేసిన చీర్ల రమేష్**




మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )మెడ్చల్ ప్రజల నీటి సమస్యను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని త్వరితగతిన స్పందించిన హెచ్ఎండబ్ల్యూ ఎస్ ఎస్ బి ఎండీ అశోక్ రెడ్డి బృందానికి మేడ్చల్ వైస్ చైర్మన్ చీర్ల రమేష్ కృతజ్ఞతలు తెలిపారు. ఇదేవిధంగా మెడ్చల్ ప్రాంతంలో పెరుగుతున్న నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని మెడ్చల్‌కు ప్రత్యేక రిజర్వాయర్ ఏర్పాటు చేయాలని, కోరుతూ ఆయనకు వినతి పత్రం అందజేశారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నీటి సరఫరా వ్యవస్థను అభివృద్ధి చేయాలని వినతి పత్రంలో చీర్ల రమేష్ కోరారు. ఇదేవిధంగా మెడ్చల్ పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ సమస్యలు, మురుగు నీటి సరైన నిర్వహణ, అలాగే ఎస్ టి పి ఏర్పాటుపై కూడా ఎండి అశోక్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.ఈ అంశాలపై స్పందించిన హెచ్ఎం డబ్ల్యు ఎస్ ఎస్ బి ఎండీ అశోక్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. అతి త్వరలో పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారని చీరల రమేష్ తెలిపారు.ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని పేర్కొన్నారు.

# బ్రాండింగ్ సంచుల్లో రేషన్ బియ్యం దందా

- యదేచ్ఛగా మాఫియా దూకుడు
- అధికారుల దాడులకు లెక్కచేయని వ్యాపారులు
- బ్రాండింగ్ సంచుల్లో రేషన్ బియ్యం పెట్టి హోటళ్లకు సరఫరా
- కొన్ని హోటల్లో వినియోగదారులు తింటుంది రేషన్ బియ్యంమేనా.?





**హైదరాబాదు (ప్రశ్న న్యూస్)** రాష్ట్రంలో రేషన్ బియ్యం అక్రమ రవాణా రోజురోజుకు పెరుగుతూ ప్రజలను ఆగ్రహానికి గురిచేస్తోంది. ప్రభుత్వ సబ్సిడీతో పేదల కోసం అందిస్తున్న బియ్యాన్ని కొందరు దుర్వినియోగం చేస్తూ బ్రాండెడ్ బియ్యం సంచుల్లో మార్చి బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తున్న దందా వెలుగులోకి వస్తోంది. చంపాపేట్ లోని కాకుండా ఈ వ్యవహారం వెనుక పెద్ద మాఫియా నెట్వర్క్ పనిచేస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### అధికారుల దాడులు.. ఫలితం శూన్యం

ఇటీవల రేషన్ బియ్యం అక్రమ రవాణాపై సివిల్ సప్లై అధికారులు రాత్రి పగలు తేడా లేకుండా దాడులు నిర్వహిస్తున్నారు.
మంగళపల్లి, ఇబ్రహీంపట్నం, పెద్ద గోల్కొండ, పెద్ద అంబర్పేట్, రాయపోల్ మండలాల్లో సివిల్ సప్లై పోలీసులు పలుమార్లు దాడులు నిర్వహించినా అక్రమ రవాణా పూర్తిగా ఆగడం లేదు. అధికారులు కేసులు నమోదు చేస్తున్నప్పటికీ, అదే వ్యక్తులు మళ్లీ మళ్లీ దందా కొనసాగిస్తున్నారని సమాచారం. రెండు సార్లు కేసులు నమోదైన నిందితులు కూడా మూడోసారి నిర్భయంగా అదే వ్యాపారం చేయడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది.

### డీలర్లే దందాలో భాగస్వాములా.?

ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యాన్ని కొందరు డీలర్లు మాఫియాకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పేదల కోసం ఉద్దేశించిన బియ్యం, మధ్యవర్తుల చేతుల్లోకి వెళ్లి చివరికి బ్రాండెడ్ సంచుల్లో మార్కెట్‌లోకి వస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. హోటలలో, టిఫిన్ సెంటర్లు, గృహాలకు కూడా బ్రాండింగ్ పేరుతో అమ్మకాలు చేస్తున్నారు. 20 రూపాయలకు కొని 42 నుండి 50 రూపాయల వరకు అమ్ముతున్నట్లు సమాచారం. అయితే హోటల్ యజమానులు కూడా తక్కువ రేటుకు వస్తున్నాయని బ్రాండింగ్ కంపెనీ ఉందని కొనుగోలు చేసి వినియోగదారులకు పెట్టడంతో కొన్ని హోటల్లో వినియోగదారులు ప్రశ్నించిన హోటల్ యజమానులు లేదు బ్రాండింగ్ బియ్యమంటూ బుకాయిస్తున్నారు. ఈ వ్యవహారంలో డీలర్ల పాత్రపై సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

### పీడీయాక్ట్ విధించాలని డిమాండ్..

రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు అధికారుల కఠిన చర్యలు అవసరమని ప్రజలు కోరుతున్నారు. రెండు సార్లు కేసులయిన వారిపై మూడోసారి దొరికితే పీడీయాక్ట్ కింద కేసులు నమోదు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. సాధారణ కేసులు మాఫియాపై ఎలాంటి ప్రభావం చూపడం లేదని, కఠిన చట్టపరమైన చర్యలే సరైన పరిష్కారం అని ప్రజల నుండి అభిప్రాయం వ్యక్తమవుతోంది.

### లైసెన్స్ రద్దు చేయాలి..


అక్రమాలకు పాల్పడుతున్న రేషన్ డీలర్లను గుర్తించి వారి సీఎంఆర్ లైసెన్సులను వెంటనే రద్దు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జిల్లాలలో సివిల్ సప్లై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఇబ్బంది, అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇటీవల రంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలలో ఉన్న సివిల్ సప్లై అధికారులు టాస్క్ ఫోర్త్ సివిల్ సప్లై అధికారులు మాత్రమే దాడులు చేస్తున్నారని మిగతా జిల్లాలలో రేషన్ బియ్యం మాఫియా ను అధికారులు కట్టడి చేయకపోవడం వెనుక వాళ్ళు ఇచ్చే లంచాలే కారణం అన్న విమర్శలు వినిపిస్తున్నాయి.


### రాష్ట్రవ్యాప్తంగా అధికారులు దాడులు చేయాలి

ప్రభుత్వం పేదల కోసం ఇస్తున్న రేషన్ బియ్యం దందా వల్ల నిజమైన లబ్ధిదారులు నష్టపోతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక దళాలను ఏర్పాటు చేసి ఈ మాఫియాను అణచివేయాలని, పేదల హక్కులను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా అక్రమార్కుల భారీ సంపాదన మాత్రమే కాదు, పేదల ఆకలి మీద జరుగుతున్న దాడి. కాబట్టి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అధికారులు కఠిన చర్యలు తీసుకుని ఈ దందాకు పూర్తిగా చెక్ పెట్టాల్సిన అవసరం ఉంది.

# రహదారా చెత్తకుప్పల నిలయమా.?

- నాచారం వెంకటరెడ్డి నగర్‌లో దుర్వాసనతో నరకయాతన
- మున్సిపల్ సిబ్బంది చేతులమీదుగా చెత్త పారవేత - ఫిర్యాదులు చేసినా స్పందన లేని అధికారులు





**నాచారం(ప్రశ్న న్యూస్)** నాచారం పరిధిలోని వెంకటరెడ్డి నగర్ ప్రాంతం ప్రజలకు ఇబ్బందుల నిలయంగా మారింది. ఒకప్పుడు సాధారణ నివాస ప్రాంతంగా ఉన్న ఈ కాలనీ, ఇప్పుడు చెత్తకుప్పలతో నిండిపోయి దుర్వాసనతో ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెడుతోంది. ముఖ్యంగా రహదారులపై ఎక్కడ చూసినా చెత్త పేరుకుపోవడం వల్ల ప్రజలు నడవడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారు. స్థానికుల ఆరోపణల ప్రకారం, మున్సిపల్ సిబ్బంది సేకరించిన చెత్తను సరైన విధంగా డంపింగ్ యార్డులకు తరలించకుండా, ఇక్కడే ఖాళీ ప్రదేశాల్లో పడేస్తున్నారు. దీంతో రోజు రోజుకీ పెద్ద చెత్తకుప్పలు పెరిగి, కాలుష్యం అధికమవుతోంది. వర్షాకాలంలో వర్షాలు పడ్డప్పుడు ఈ చెత్త నీటితో కలసి కాలనీలోకి చేరి మరింత దుర్వాసన, దోమల సమస్యను పెంచుతోంది.స్థానిక ప్రజలు పలుమార్లు నాచారం సర్కిల్ సానిటేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. డిప్యూటీ కమిషనర్ స్థాయి అధికారులకు సమాచారం అందించినా పరిస్థితిలో ఎలాంటి మార్పు కనిపించడం లేదని "ప్రజల ఆరోగ్యం కంటే అధికారుల నిర్లక్ష్యమే ఎక్కువగా కనిపిస్తోంది" అంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యంతో చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన కార్యక్రమం కూడా ఇక్కడ గాలికే ఎగిరిపోయిందని ప్రజలు విమర్శిస్తున్నారు. శుభ్రత, పారిశుధ్యం అనే లక్ష్యాలు కాగితాలకే పరిమితమయ్యాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు కేవలం నివేదికలకే పరిమితమై, నేలమీద పనులు చేయడంలో విఫలమవుతున్నారని అంటున్నారు.ఇంకా ఆశ్చర్యకర విషయం ఏమిటంటే, ఉప్పల్ జోనల్ కమిషనర్ పర్యవేక్షణ కూడా ఈ ప్రాంతంలో పూర్తిగా లేనట్టే ఉందని ప్రజలు చెబుతున్నారు. పర్యవేక్షణ లేకపోవడంతో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. చెత్తకుప్పల వల్ల దోమలు, ఈగలు విపరీతంగా పెరిగి డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల భయం ప్రజల్లో నెలకొంది. చిన్నపిల్లలు, వృద్ధులు ఎక్కువగా ఇబ్బందులు పడుతున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.ఇప్పటికైనా నాచారం సర్కిల్ అధికారులు స్పందించి వెంటనే చెత్తను తొలగించడంతో పాటు, ఇకపై ఇలాంటి పరిస్థితులు రాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. "చెత్తను పారేసే ప్రాంతం కాదు, ఇది నివాస కాలనీ" అని ప్రజలు స్పష్టంగా చెబుతున్నారు.ప్రభుత్వం ప్రకటించిన పథకాలు అమలు కావాలంటే, కేవలం ప్రకటనలు సరిపోవని, క్షేత్రస్థాయిలో చర్యలు అవసరమని ఈ ఘటన మరోసారి స్పష్టంచేస్తోంది.

## 'డిజిటల్ అరెస్ట్' పేరుతో
# రూ.1.6 కోట్ల భారీ మోసం

- ఏపీ, తెలంగాణలో ఐదు చోట్ల సీబీఐ విస్తృత సోదాలు
- ఇండస్ఇండ్ బ్యాంకు అధికారితో సహా ముగ్గురు నిందితుల అరెస్ట్
- ఇలాంటి మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్న సీబీఐ



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** డిజిటల్ అరెస్ట్ పేరుతో జరిగిన భారీ కుంభకోణం కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ దూకుడు పెంచింది. శనివారం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని ఐదు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించి, ఓ బ్యాంకు అధికారితో సహా ముగ్గురిని అరెస్ట్ చేసింది. ఓ సీనియర్ సిటిజన్‌ను 'డిజిటల్ అరెస్ట్' చేస్తామంటూ బెదిరించి, ఆయన నుంచి రూ. 1.6 కోట్లకు పైగా వసూలు చేసినట్లు ఈ కేసు నమోదైంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ ఈ కేసు దర్యాప్తు చేపట్టింది. అరెస్టయిన వారిలో ఇండస్ఇండ్ బ్యాంక్ నాటి అసిస్టెంట్ మేనేజర్ దుబ్బాక మహేశ్‌తో పాటు రాజేశ్ కన్న, వాయల శ్రీనివాస్ ఉన్నారు. నిందితులు ఓ కంపెనీ పేరుతో నకిలీ బ్యాంకు ఖాతాను తెరిచి, మోసం చేసిన డబ్బును అందులోకి మళ్లించినట్లు సీబీఐ గుర్తించింది. ఆ తర్వాత నేరం మూలాలను దాచిపెట్టేందుకు, ఆ డబ్బును పలు ఖాతాలకు బదిలీ చేసినట్లు తేలింది. నకిలీ ఖాతా తెరవడంలో బ్యాంకు అధికారి మహేశ్ సహకరించాడని, మిగిలిన ఇద్దరు నిందితులు మ్యూల్ అకౌంట్లను ఏర్పాటు చేయడం, నిధుల తరలింపును నిర్వహించడం వంటి పనులు చేశారని అధికారులు తెలిపారు.నిందితులకు సంబంధించిన ప్రాంతాల్లో జరిపిన సోదాల్లో కీలక పత్రాలు, ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు సీబీఐ వెల్లడించింది. వాటిని విశ్లేషించి మరిన్ని ఆధారాలు సేకరిస్తున్నట్లు పేర్కొంది. ఈ సందర్భంగా ప్రజలకు సీబీఐ కీలక సూచనలు జారీ చేసింది. చట్టంలో 'డిజిటల్ అరెస్ట్' అనే పదం ఎక్కడా లేదని, అలాంటి బెదిరింపులకు ఎవరూ భయపడొద్దని స్పష్టం చేసింది. పోలీసుల పేరుతో గానీ, ఇతర అధికారుల పేరుతో గానీ వచ్చే కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఏదైనా అనుమానాస్పద లావాదేవీని గమనిస్తే వెంటనే జాతీయ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో లేదా సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కోరింది.

# తెలంగాణలో మండుతున్న ఎండలు

- కొమురంభీమ్ జిల్లాలో 44.6 డిగ్రీల ఉష్ణోగ్రత



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్రంలో భానుడి భగభగతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం తొమ్మిది గంటల నుంచే బయటకు రాలేని పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటాయి. కొమురంభీమ్ జిల్లాలోని కెరమెరిలో అత్యధికంగా 44.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. నిజామాబాద్ జిల్లాలోని మెండోరాలో 44.5 డిగ్రీలు, జగిత్యాల జిల్లా ఎండపల్లిలో 44.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తెలంగాణలోని అన్ని ప్రాంతాల్లో గత సంవత్సరం ఇదే రోజుతో పోలిస్తే ఉష్ణోగ్రతలు మూడు నుంచి నాలుగు డిగ్రీలకు పైగా పెరిగాయి. గత సంవత్సరం ఇదే రోజున అత్యధిక ఉష్ణోగ్రత 43.4 డిగ్రీలు కాగా, ఈ సంవత్సరం శనివారం 44.6 డిగ్రీలుగా నమోదైంది. రోజురోజుకు ఎండలు పెరుగుతున్నందున చిన్నారులు, వృద్ధులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ సూచించింది. అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని కోరింది.

# హర్మూజ్ మళ్లీ మూసివేత

- ఇరాన్ సంచలన నిర్ణయం



**టెహ్రాన్ (ప్రశ్న న్యూస్)** అమెరికాతో ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్ సంచలన నిర్ణయం తీసుకుంది. వ్యూహాత్మకమైన హర్మూజ్ జలసంధిని మళ్లీ మూసివేసింది. హర్మూజ్ పై మళ్లీ కఠిన నియంత్రణ విధిస్తున్నట్లు నేడు ఓ ప్రకటనలో తెలిపింది. తమ ఓడరేవులకు వచ్చే నౌకలపై అమెరికా నేవీ దిగ్బంధనాన్ని కొనసాగించడమే ఈ నిర్ణయానికి కారణమని, ఇచ్చిన మాటను అమెరికా ఉల్లంఘించిందని ఇరాన్ ఆరోపించింది."ఇరాన్ నౌకలకు స్వేచ్ఛా రవాణాను అమెరికా పునరుద్ధరించే వరకు ఈ పరిస్థితిలో మార్పు ఉండదు. హర్మూజ్ జలసంధి కఠినంగా నియంత్రించబడుతుంది" అని ఇరాన్ సైనిక కమాండ్ తమ అధికారిక టెలివిజన్‌లో స్పష్టం చేసింది.ఇజ్రాయెల్-లెబనాన్ కాల్పుల విరమణ ఒప్పందం తర్వాత, కేవలం రెండు రోజుల క్రితమే ఇరాన్ ఈ జలసంధిని తెరిచింది. అయితే, ఇరాన్‌తో విస్తృత ఒప్పందం కుదిరే వరకు నేవీ దిగ్బంధనం కొనసాగుతుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేయడంతో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. పర్షియన్ గల్ఫ్ నుంచి ఆయిల్ ఎగుమతులకు హర్మూజ్ జలసంధి ప్రధాన మార్గం. ప్రపంచ ఆయిల్ రవాణాలో దాదాపు 20 శాతం ఇక్కడి నుంచే జరుగుతుంది. ఇరాన్ తాజా నిర్ణయంతో మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు మళ్లీ పెరిగే అవకాశం ఉందని, ఇది ప్రపంచ ఆయిల్ ధరలపై ప్రభావం చూపే ప్రమాదం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588